ప్రజాశక్తి
గురువారం 24 జులై 2025
5
కర్నూలు





మాట్లాడుతున్న కలెక్టర్

గురుకుల కళాశాల తనిఖీ చేసిన కలెక్టర్

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

వసతిగృహాల్లో ఉన్న విద్యార్థులకు నాణ్యమైన విద్య, వసతి సౌకర్యాలను అందించాలని జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాషా అధికారులను ఆదేశించారు. బుధవారం చిన్నటేకూరులోని డాక్టర్ బిఆర్.అంబేద్కర్ సెంటినరీ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ బాలుర జూనియర్ కళాశాలను జిల్లా కలెక్టర్ తనిఖీ చేశారు. జిల్లా కలెక్టర్ రెసిడెన్షియల్ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు కల్పిస్తున్న వసతి సౌకర్యాలు, విద్యా బోధన గురించి అడిగి తెలుసుకున్నారు. పిల్లలు పడుకోవడానికి అదనంగా రెండు గదులు ఏర్పాటు చేసేందుకు ఎస్టిమేట్స్ తయారుచేసి పంపించాలని, సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాలల జిల్లా కో ఆర్డినేటర్ శ్రీదేవిని ఆదేశించారు. కళాశాలలో కొన్ని గదుల్లో పైకప్పు పాడయినందువల్ల వాటితో పాటు, అవసరమైన ఇతర మరమ్మతులకు ఎస్టిమేట్స్ పంపించాలన్నారు. కార్యక్రమంలో సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాలల జిల్లా కోఆర్డినేటర్ శ్రీదేవి, కల్లూరు తహశీల్దార్ ఆంజనేయులు, జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ వేణుగోపాల్, ఐఐటి నీట్ అకాడమీ ఇంచార్జి ఉమామహేశ్వరప్ప, ఎస్‌డబ్ల్యుఆర్ఎస్ ఇఫ్ ఎక్స్ చైర్మన్ చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్లకు ఉపాధి చూపాలి

- ప్రతి ఆటో డ్రైవర్‌కు నెలకు రూ.15వేలివ్వాలి
- కలెక్టరేట్ ఎదుట ఆటో డ్రైవర్ల ధర్నా



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న ఆటో డ్రైవర్లు, సిఐటియు, ఆటో యూనియన్ నాయకులు

ప్రజాశక్తి-కర్నూల్ కలెక్టరేట్

ఉచిత బస్సు ప్రయాణం వల్ల నష్టపోనున్న ఆటో డ్రైవర్లందరికీ నెలకు రూ.15,000 ఇవ్వాలని ఆటో డ్రైవర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.ప్రభాకర్ , సిఐటియు న్యూ సిటీ ప్రధాన కార్యదర్శి సిహెచ్ సాయి బాబా ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం కలెక్టరేట్ ముందు ఎపి ఆటో అండ్ ట్రాలీ డ్రైవర్స్ యూనియన్ సిఐటియు న్యూ సిటీ కమిటీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. న్యూ సిటీ అధ్యక్షులు ఎస్.హుస్సేన్ వలి అధ్యక్షతన జరిగిన ధర్నాలో యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.ప్రభాకర్, సిఐటియు న్యూ సిటీ సిఐటియు ప్రధాన కార్యదర్శి సిహెచ్ సాయిబాబా మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడానికి అలవి కానీ వాగ్దానాలు చేసి అధికారంలోకి వచ్చి హామీల అమలుకు ఆపసోపాలు పడుతుందన్నారు. కుక్కను చూసి నక్క వాత పెట్టుకున్న చందంగా ఉచిత బస్సు పథకం అమలు చేస్తానని వాగ్దానాన్ని అమలులోకి తేవడం వల్ల ఆటో డ్రైవర్లు పక్క రాష్ట్రాల్లో పడుతున్న ఇబ్బందులను ప్రభుత్వం పరిగణంలోకి తీసుకోవాలన్నారు. అక్కడ పడుతున్న బాధలు ఇబ్బందులు మన రాష్ట్రంలో పడకుండా కూటమి ప్రభుత్వం చూడాలని, వాటి పరిష్కారానికి కృషి చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఉచిత బస్సుప్రయాణం వల్ల ఆటో డ్రైవర్లు వారి కుటుంబాలు రోడ్ల పాలయ్యాయన్నారు. మన రాష్ట్రంలో ఆ పరిస్థితి రాకముందే ప్రభుత్వం ఉచిత బస్సు పథకం అమలు అయ్యేలోపు ఉచిత బస్సు ప్రయాణం వల్ల నష్టపోనున్న ప్రతి ఆటో డ్రైవర్‌కు నెలకు రూ.15 వేలు ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రతి సంవత్సరం రూ.15వేలు వాహన మిత్ర పథకం కింద ఇస్తామన్న పథకాన్ని వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఓలా! ఉబర్, రాపిడ్ వంటి ప్రైవేటు సంస్థలు పుట్టగొడుగుల్లాగా పుట్టుకొచ్చాయని, ఆటో డ్రైవర్ల శ్రమను దోపిడీ చేస్తున్నాయన్నారు. తక్కువ కమిషన్‌తో మొదలైన ఈ వ్యాపారం వాళ్ళ యొక్క సంస్థను విస్తరించుకొని అధిక కమిషన్లతో ఆటో డ్రైవర్లను దోపిడీలకు గురిచేస్తున్నాయన్నారు. డ్రైవర్లకు నష్టదాయకమైన ప్రైవేటు యాపులను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అధిక చలానా ధరలు, ఫైన్లు విధించే జీవో నెంబర్ 21 ఏ చిన్న ప్రమాదం జరిగిన భారీగా జరిమానాలు, జైలు శిక్షలు విధించే సెక్షన్ 106 రద్దు చేయాలన్నారు. పెట్రోల్ డీజిల్ గ్యాస్ రాయితీ ధరలకు సరఫరా చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు ప్రభుత్వం వెంటనే స్పందించి పై సమస్యలు పరిష్కరించకుంటే రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన చేస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ ధర్నాలో న్యూ సిటీ కార్యదర్శి బి.రాధాకృష్ణ, కార్యదర్శివర్గ సభ్యులు ఎస్.మాలిక్‌బాష, షంషీర్‌బాష, రైల్వే స్టేషన్‌శీను, సురేష్, ట్రాలి రంగన్న, రాజశేఖర్, మధు నగర నాయకులు. మౌలాలి, శివకృష్ణ జయన్న, బుజ్జి, నాగేంద్ర,పెద్ద కరుణ, కె.రాజా రంగన్న అయ్యన్న నారాయణ రెడ్డి, మధు, జయరాజ్, వివిధ అడ్డాల నుంచి 150 మంది డ్రైవర్లు పాల్గొన్నారు.

ప్రజల సహకారంతో నగరాభివృద్ధి

-తడి, పొడి చెత్త వేరు చేసి ఇవ్వాలి - పశువులను రహదారులపైకి వదిలితే చర్యలు
- నిరంతరం నగరంలో ప్రత్యేక బృందాలు
- అర్హులందరు ఇళ్లకు దరఖాస్తు చేసుకోవాలి : నగరపాలక కమిషనర్ పి.విశ్వనాథ్

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

కర్నూలు నగర సమగ్రాభివృద్ధికి ప్రజల సహకారం కీలకమని, నగరాన్ని ఆదర్శంగా నిలిపేందుకు ప్రతి పౌరుడు తమ సహకారం అందించాలని నగరపాలక సంస్థ కమిషనర్ పి.విశ్వనాథ విజ్ఞప్తి చేశారు. బుధవారం నగరపాలక కార్యాలయంలోని విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పారిశుధ్య నిర్వహణకు తడి, పొడి చెత్తా వేరు చేసి కార్పొరేషన్ సిబ్బందికి అందించాలని కోరారు. బహిరంగ ప్రదేశాల్లో, డ్రైనేజీ కాలువల్లో చెత్తాచెదారం వేయొద్దని సూచించారు. సాలిడ్‌వేస్టేజ్ మేనేజ్ మెంట్‌ను సమర్థవంతంగా అమలు నిర్వహిస్తు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రోత్సాహం లభిస్తుం దన్నారు. భవన నిర్మాణ వ్యర్థాల నిర్వహణకు సరికొత్త విధానం తీసుకొస్తున్నామని కమిషనర్ వెల్లడించారు. ఆగస్టు 1 నుండి ప్రత్యేక నెంబర్ పెట్టి, వాటి ద్వారా నగర పరిధిలో సి అండ్ డి వేస్టేజ్ సేకరించి, జొహరపురం డంపింగ్ యార్డ్ వద్దనున్న సిఅండ్‌డి వేస్టేజ్ మేనేజ్మెంట్ ప్లాంట్లకు తరలిస్తామని చెప్పారు. తద్వారా రీసైక్లింగ్ ప్రక్రియ చేపట్టి పునర్వినియోగానికి చర్యలు తీసుకుంటా మన్నారు. ట్రాక్టర్‌కు రూ.500, టిప్పర్‌కు రూ.1000 చొప్పున రవాణా రుసుం మాత్రమే ప్రజలు చెల్లించుకోవాల్సి ఉంటుందన్నారు. ఫలితంగా నగరంలో నిర్మాణపు వ్యర్థాలను లేకుండా చూడవచ్చని కమిషనర్ పేర్కొన్నారు. నగర రహదారులపై పశువులను వదిలితే ఇకపై చర్యలు తీసుకుంటామని కమిషనర్ స్పష్టం చేశారు. నగర ప్రజలకు 24 గంటలపాటు సేవలు అందించేందుకు సిబ్బందితో ప్రత్యేక బృందం, ఒక టోల్ ఫ్రీను త్వరలో ఏర్పాటు చేస్తామని కమిషనర్ తెలిపారు. వాటి ద్వారా తాగునీటి సమస్య, వీధి దీపాలు, పారిశుధ్యం, ఇతరత్రా సేవలను సులువుగా పొందవచ్చని సూచించారు. ఆర్థికంగా బలంగా ఉంటేనే మౌలిక సదుపాయాల కల్పన, నగరాభివృద్ధి సాధ్యం అవుతుందన్నారు. ప్రస్తుతం ఉన్న పన్నులను కూడా కొంతమంది చెల్లించకపోవడం సమంజసం కాదన్నారు. ఏటా రూ.100 కోట్ల ఆదాయం నగరపాలకకు రావాల్సి ఉంటుందన్నారు. కొంతమంది పన్నుల చెల్లింపునకు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నట్లు తమ దృష్టికి వస్తుందని, వారిపై చర్యలు తీసుకుంటా మని హెచ్చరించారు. నగరంలో మౌలిక సదుపాయాల కల్పనకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నామని, రహదారులు, డ్రైనేజీ కాలువల నిర్మాణం, వీధి దీపాలు, గుంతలు పూడ్చటం వంటి పనులను ప్రాధాన్యత క్రమంలో చేపడుతున్నామని కమిషనర్ తెలిపారు. అభివృద్ధికి నగరంలో తొలుత 9 పార్కులను ఎంపిక చేశామని, వాటి అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళిక అమలు చేస్తున్నామని తెలిపారు. అర్హులందరూ ఇళ్లస్థలాలకు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. 2 సెంట్ల స్థలంతో పాటు నిర్మాణానికి ప్రభుత్వం సబ్సిడీ ఇస్తుందని, టిడ్కోలో ఖాళీ గృహాలను సైతం కేటాయిస్తామని తెలిపారు. ట్రాఫిక్ నియంత్రణకు నగరంలో పూర్తి స్థాయిలో చర్యలు తీసుకుంటున్నామని, త్వరలో వీధి వ్యాపారుల కోసం జోన్లను ఏర్పాటు చేయ బోతున్నట్లు కమిషనర్ వెల్లడించారు. కార్పొరేషన్, సచివాలయ సిబ్బంది ప్రజలకు సేవలు అందించాల్సినని, అందులో ఎవరైనా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నట్లు తమ దృష్టికి వస్తే చర్యలు తీసుకుంటామని కమిషనర్ తెలిపారు. క్షేత్రస్థాయిలో ప్రతి ఉద్యోగి తమ విధులను సక్రమంగా, సమన్వయంతో పనిచేసి ప్రజల మన్ననలు పొందాలన్నారు. సమావేశంలో మేనేజర్ ఎస్.చిన్నరాముడు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కమిషనర్ పి.విశ్వనాథ

ప్రభుత్వ పాఠశాలల సమస్యలు పరిష్కరించాలి

- సిపిఎం జిల్లా కార్యదర్శి గౌస్ దేశాయ్

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

ప్రభుత్వ పాఠశాలలలో సమస్యలను పరిష్కరించాలని మౌలిక వసతులు కల్పించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి డి.గౌస్‌దేశాయ్, నగర కార్యదర్శి ఎం.రాజశేఖర్ డిమాండ్ చేశారు. స్కూల్ పర్యటనలలో భాగంగా బుధవారం ఎం.రాజశేఖర్, ఎస్ఎండి షరీఫ్, నగర నాయకులు డి.పార్వతయ్య, శాలిబాష తదితరులతో కలిసి గౌస్‌దేశాయ్ ప్రభుత్వ హైస్కూల్, ప్రభుత్వ బాయ్స్ (ఉర్దూ)హైస్కూల్ , ప్రభుత్వ మైనారిటీ కాలేజీలో అక్కడి సమస్యలను తెలుసుకునేందుకు వారు పర్యటించారు. బాలికల పాఠశాలలో చెత్తాచెదారం ఉందని, ఆ డస్ట్ మొత్తం తీసేయాల్సిన అవసరం ఉందని తెలిపారు. అదనపు గదుల నిర్మాణం మధ్యలోనే ఆగిపోయిందని, మూడు నుండి ఐదు గదులు అవసరం అక్కడ విద్యార్థులకు ఉందని, తక్షణమే ప్రభుత్వం నిధులను కేటాయించి తరగతి గదులు నిర్మించాలని వారు డిమాండ్ చేశారు. ప్రభుత్వ పాఠశాలలలో తప్పనిసరిగా లైబ్రరీని ఏర్పాటు చేయాలని, ఒక లైబ్రరీయన్ కూడా నియమించాలని పభుత్వాన్ని డిమాండ్ చేశారు. గవర్నమెంట్ ఉర్దూ కాలేజీలో విద్యార్థులు ఆటలాడుకోవడానికి గ్రౌండ్ లేదన్నారు. తక్షణమే గ్రౌండ్ కేటాయించాలని వారు డిమాండ్ చేశారు. గవర్నమెంట్ బాయ్స్ ఉర్దూ పాఠశాలలో 24 మంది టీచర్లకు గాను 20 మంది మాత్రమే ఉన్నారని, మిగతా నాలుగు పోస్టుల భర్తీ చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఇక్కడ కూడా లైబ్రరీ లైబ్రేరియన్ లేరని తక్షణమే ప్రభుత్వం భర్తీ చేయాలన్నారు. కాలేజీలో మౌలిక వసతులు కల్పించాలని డిమాండ్ చేశారు.



విద్యార్థినులతో మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి డి.గౌస్‌దేశాయ్

క్లిక్ చేస్తే సైబర్ నేరగాళ్ళ చేతిలో మోసపోతారు

- ఎస్‌పి విక్రాంత్ పాటిల్

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్

ఈ చలాన్ పేరుతో వచ్చే సందేశాల పట్ల జాగ్రత్తగా ఉండాలని జిల్లా ఎస్పి విక్రాంత్ పాటిల్ జిల్లా ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఈ చలాన్ పేరుతో వచ్చే లింక్స్ తొందరపడి క్లిక్ చేయొద్దని సూచించారు. వివిధ సామాజిక మాధ్యమాల్లో RTO Traffic Challan.apk "అనే పేరుతో వైరల్ అవుతోందన్నారు. ఈ లింక్‌ను క్లిక్ చేసి డౌన్‌లోడ్ చేసుకునే వారి ఫోన్‌లో రహస్య సమాచారాన్ని సైబర్ నేరగాళ్లు చోరీ చేసే ప్రమాదం ఉందన్నారు. ఇదివరకు పిఎం కిసాన్ యోజన, ఎస్‌బిఐ క్రెడిట్ కార్డులు, రివార్డులు, కెవైసి అప్డేట్ పేర్లతో సైబర్ మోసాలకు పాల్పడే నేరగాళ్లు నూతన ఎత్తుగడకు పథకం వేసి ట్రాఫిక్ చలానా పేరుతో ప్రజల బ్యాంకు ఖాతాలలోని డబ్బులను లూటీ చేసేందుకు సిద్ధమయ్యారని గుర్తించుకుని అప్రమత్తంగా ఉండాలన్నారు.

ఈ చలాన్ పేరున నేరం ఇలా :ముందుగాఎపికె ఫైల్ ను పంపుతారు. నమ్మదగిన వాట్సాప్ గ్రూపులలో షేర్ చేస్తారు. ఆ గ్రూపులో ఉన్న సభ్యులు దానిని నమ్మి ఆలోచించకుండా apk ఫైల్‌ను క్లిక్ చేసి ఇన్‌స్టాల్ చేస్తారు. వెంటనే ...మీ అనుమతి లేకుండా క్రెడిట్ కార్డు నుంచి ఆన్‌లైన్‌లో కొనుగోళ్లు జరిగినట్లు మెస్సేజ్‌లు వస్తాయి.

APK ఫైల్ ను మీరు ఇన్‌స్టాల్ చేస్తే : అది మీఎస్ఎంఎస్‌లను యాక్సెస్ చేయగలదు మీ బ్యాంక్ అకౌంట్, క్రెడిట్ కార్డు వివరాలను తెలుసుకోవచ్చు. మీ ఫోన్ను ఓ రిమోట్ మాదిరి సైబర్ నేరగాళ్ళు నియంత్రిస్తారన్నారు.

గుర్తు తెలియని, అనధికార లింక్లను క్లిక్ చేయకండి. APK ఫైల్స్ డౌన్లోడ్ చేయకండి. వాట్సప్ గ్రూపుల్లో షేర్ చేస్తే వచ్చే మెసేజ్లను గుడ్డిగా నమ్మకండి. నేరగాళ్ల వాటిని అధికారికంగా ఉన్నట్లే మాయ చేసి వాటిని అలా పెడతారు. యాప్స్‌ను ఎల్లప్పుడు గూగుల్ ప్లే స్టోర్ నుంచే డౌన్లోడ్ చేయండి. అనుమానాస్పదంగా అనిపిస్తే వెంటనే కార్డును బ్లాక్ చేయండి. సైబర్ నేరాల పట్ల ఫిర్యాదు చేయడానికి వెంటనే 1930 కి కాల్ చేయాలని లేదా www.cybercrime.gov.inద్వారా తెలియ జేయాలని జిల్లా ప్రజలకు ఎస్పి విక్రాంత్ పాటిల్ విజ్ఞప్తి చేశారు.

విధులకు సక్రమంగా హాజరు కావాలి

ఆర్‌డిఒ భరత్ నాయక్

ప్రజాశక్తి-మద్దికేర : మద్దికేర తహసీల్దారు కార్యాలయాన్ని బుధవారం సాయంత్రం పత్తికొండ ఆర్‌డిఒ భరత్ నాయక్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులు, కంప్యూటర్లలో భూముల వివరాలను పరిశీలించారు. భూముల రీసర్వే ఎంతవరకు పూర్తయిందనే దానిపై ఆకస్మిక తనిఖీ చేసనట్లు తెలుస్తుంది. ఈ సందర్భంగా ఆర్‌డిఒ భరత నాయక్ మాట్లాడుతూ సిబ్బంది తమ విధులకు సక్రమంగా హాజరు కావాలన్నారు. రైతులకు అందుబాటులో ఉంటూ ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వచ్చిన ఫిర్యాదులను వెంటనే పరిష్కారం చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ గుండాల నాయక్ , విఆర్‌ఒలు, వీఆర్‌ఏలు రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రైతులకు సాగుపై అవగాహన

ప్రజాశక్తి-వెల్దుర్తి

పుల్లగుమ్మి గ్రామములో జిల్లా వనరుల కేంద్రం, కర్నూలు వారి ఆధ్వర్యంలో వివిధ పంటలపై రైతులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఖరీఫ్ లో సాగు చేసిన మొక్కజొన్న, కంది, మిరప మరియు పత్తి పంటలపై సమగ్ర పంటల యాజమాన్య పద్ధతులపై ఎడిఎ ఎస్. వెంకటేశ్వర్లు పత్తి పంటలో గులాబీ రంగు పురుగు సమగ్ర సస్యరక్షణ చర్యల గురించి వ్యవసాయ అధికారి శశిధర్ రెడ్డి లు రైతులకు అవగాహన కల్పించారు. మొక్కజొన్న పంటలో కత్తెర పురుగు నివారణ కొరకు తీసుకోవలసిన జాగ్రత్తలను రైతులకు తెలిపారు. రైతులకు వివిధ పంటల సమాచార కరదీపికకు పంపిణీ చేశారు. కార్యక్రమం అనంతరం రైతు సేవా కేంద్రానికి వచ్చిన యూరియాను అవసరమైన రైతులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వెల్దుర్తి మండల వ్యవసాయ అధికారిఆర్ అక్బర్ బాషా,రైతు సేవా కేంద్రం సిబ్బంది, శ్రవణ్ కుమార్ రెడ్డి, మరియు రైతులు పాల్గొన్నారు.

అధికారులకు సన్మానం

ప్రజాశక్తి-సి బెళగల్ : కొత్తకోట సచివాలయంలో ఆయా శాఖధికారులుగా పనిచేస్తున్న ఆరుగురు అధికారులు పలు మండలాలకు ఇటీవల బదిలీపై వెళ్లారు. ఇందులో భాగంగా బుధవారం సర్పంచి శ్రీనివాసులు, కార్యదర్శి సైపుల్లా బేగ్ సమక్షంలో సన్మాన సభను నిర్వహించారు. ఈ సందర్భంగా బదిలీ అధికారులు దత్తాత్రేయ, షరీఫ్, మౌనిక, జ్యోతి, మోహన్, ఖాజా బాషాలు చేసిన సేవలను కొనియాడారు.



అధికారులను సన్మానిస్తున్న దృశ్యం

మాతృ మరణాలపై డిఎంహెచ్ఒ సమీక్ష

ప్రజాశక్తి- కర్నూలు హాస్పిటల్

జిల్లా వైద్య , ఆరోగ్య శాఖాధికారి కార్యాలయంలో బుధవారం జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ పి.శాంతికళ ఆధ్వర్యంలో "మాతృ మరణాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముజఫర్ నగర్ పట్టణ ఆరోగ్య కేంద్రం పరిధిలో జూన్ 2025 నెలలో సంబవించిన మాత మరణాలపై సమీక్ష నిర్వహించారు. క్షేత్ర స్థాయిలోని సిబ్బంది ఆశా, ఆరోగ్య కార్యకర్త , వైద్యాధికారులు గర్భవతులను తొందరగా గుర్తించి వారికి సరైన సమయంలో సమయానుసార వైద్య సేవలు అందించినట్లయితే తల్లుల మరణాల శాతం తగ్గించవచ్చని కమిటీ నిర్ధారించింది. ఒకవేళ ఆ గర్భవతులను హై రిస్కిగా గుర్తించినట్లయితే ఆశా, ఆరోగ్య కార్యకర్త, పర్యవేక్షులతో ట్రాక్ చేసి సమీప సామాజిక ఆరోగ్య కేంద్రం , ఏరియా ఆసుపత్రులు, ప్రభుత్వ సర్వ జన వైద్య శాలలో చికిత్స అందించినట్లయితే మాతా శిశు మరణాలను తగ్గించవచ్చన్నారు. అంతే కాకుండా హై రిస్క్ గర్భవతిని కాన్పు తేదీకి మూడు రోజులు ముందుగానే ట్యాగ్ చేయబడిన ఆసుపత్రిలో అడ్మిట్ అయ్యేటట్లు చూడాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డిస్ట్రిక్ట్ నోడల్ ఆఫీసర్ డాక్టర్ నాగప్రసాద్ బాబు, డిసిహెచ్ఎస్ డాక్టర్ జప్రుల్లా, డిపిఎంఒ డాక్టర్ ఉమా , గైనకాలజి విభాగం హెచ్ఒడి డాక్టర్ సావిత్రి, ఎమర్జెన్సీ మెడిసిన్ హెచ్ఒడి డాక్టర్ రామశివ నాయక్ , అనస్తీసియా విభాగం డాక్టర్ షబానా బేగం, జనరల్ మెడిసిన్ విభాగం డాక్టర్ దివ్యశ్రీ , బ్లడ్ బ్యాంకు డాక్టర్ రంగస్వామి, ఆరోగ్యకార్యకర్తలు , ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

సొసైటీ సిఇఒ నుండి సెంట్రల్ బ్యాంకు ఎజిఎం దాకా..

ప్రజాశక్తి-సి బెళగల్ : సిబెళగల్ సొసైటీ సిఇఒగా పనిచేస్తున్న రవి కుమార్ రెడ్డి సెంట్రల్ బ్యాంకు అసిస్టెంట్ మేనేజర్ గా రాణించారు. సిబెళగల్ సొసైటీ లో రైతులకు అనేక సేవలు అందించి, రుణాలు మంజూరు చేసి ప్రజాదరణ, రైతుల నుండి విశ్వాసం పొందారు. మే 11 న సెంట్రల్ బ్యాంకు అసిస్టెంట్ మేనేజర్ పోస్టులకు పరీక్షలో పాల్గొనగా ఈ నెల 23 న ర్యాంకుల జాబితా వెల్లడి అయ్యింది. సుమారు ఈ జిల్లాలో 50 మంది పరీక్షలో పాల్గొనగా 9 మంది ఉన్నత ర్యాంకులు సాధించగా అందులో సిబెళగల్ సొసైటీ సిఇఒ రవికుమార్ రెడ్డీ ఒకరు కాగా అసిస్టెంట్ మేనేజర్ గా రాణించినందుకు ఆయన ఆయనతో పాటు సొసైటీ సిబ్బంది, సహచర సిబ్బంది, శ్రేయోభిలాషులు రవికుమార్ రెడ్డికి బుధవారం అభినందనలు తెలిపారు.



ఎల్. రవి కుమార్‌రెడ్డి

మహిళలకు స్ఫూర్తి కెప్టెన్ లక్ష్మీ సెహగల్

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

నేటి మహిళలు కెప్టన్ లక్ష్మీసెహగల్ పోరాట స్ఫూర్తితో ముందుకు సాగాలని, ప్రశ్నించే తత్త్వం అలవరచుకోవాలని ఐద్వా సీనియర్ నాయకులు పి.నిర్మల సూచించారు. బుధవారం కర్నూల్ నగరంలోని స్థానిక బి క్యాంపు ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాల లోఅఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం, ఐద్వా జిల్లా కమిటి ఆధ్వర్యంలో కెప్టెన్ లక్ష్మీ సెహగల్ వర్ధంతిని పురస్కరించుకొని 'స్వాతంత్ర్య సంగ్రామంలో కెప్టెన్ లక్ష్మీ సెహగల్ పాత్ర' అనే అంశం పై సదస్సును నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎం. ఇందిరాశాంతి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా పి.నిర్మల మాట్లాడుతూ భారత స్వాతంత్ర ఉద్యమంలో పురుషులతో పాటు స్త్రీలు సైతం పాల్గొన్నారన్నారు. వారిని స్మరించుకోవడం మనందరి బాధ్యత అన్నారు. స్వాతంత్ర సంగ్రామంలో మహిళలు పాత్ర ఎన్నదగినదని, లక్ష్మీ సెహగల్ వంటి మహిళా నాయకుల సేవలు గుర్తు చేసుకోవాలన్నారు. నాటి నాయకుల మార్గంలో యువత పయనించాలన్నారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చి ఇన్నేళ్ల గడిచినా మహిళల జీవితాల్లో పెద్దగా మార్పులు రాలేదని, మరో స్వాతంత్ర ఉద్యమానికి సిద్ధం కావాలన్నారు. డాక్టర్ మాధవి మాట్లాడుతూ నేటి సాంకేతిక యుగంలో మహిళలు సైబర్ మోసాలకు గురికావొద్దన్నారు. జాగురూకత తో వ్యవహరించాలని విద్యార్థుల కు తెలిపారు. ఐద్వా జిల్లా కార్యదర్శి .అలివేలు మాట్లాడుతూ మహిళలు చేయలేనిది, సాధించలేనిది ఏది లేదని నేడుఅన్ని రంగాలలో విజయవంతంగా ముందుకు సాగుతున్న మహిళలనుండి స్ఫూర్తిని పొందాలన్నారు. ఈ కార్యక్రమంలో జన విజ్ఞాన వేదిక జిల్లా నాయకులు. సుజాత చరిత్ర శాఖ అధ్యక్షులు వెంకటస్వామి వైస్ ప్రిన్సిపల్ జె.హేమంత్, ఎ.సత్యనారాయణ, ఐద్వా జిల్లా అధ్యక్షురాలు అరుణ ఐద్వా నగర నాయకులు వేణి, అమీనా, క్రమీన్, కళాశాల అధ్యాపకులు డాక్టర్ మాదన్న, డాక్టర్ జాఫరున్నిసా, డాక్టర్ రోషన్న, మీనాక్షి, శశికళ, డాక్టర్ వింధ్యవాసిని పాల్గొన్నారు.



లక్ష్మీ సెహగల్ చిత్రపటానికి నివాళ్లులర్పిస్తున్న ఐద్వా నేతలు

సమస్యల పరిష్కారానికి చర్యలు

ప్రజాశక్తి-కర్నూల్ కార్పొరేషన్

కర్నూలు జిల్లాలోని విద్యుత్ సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని విద్యుత్ శాఖ ఎస్ఇ ఎం ఉమాపతి చెప్పారు. బుధవారం డయల్ యువర్ ఎస్ఇ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి విద్యుత్ స్తంభాలకు సంబంధించి రెండు, విద్యుత్ లైన్లకు సంబంధించి మూడు, విద్యుత్ సరఫరా అంతరాయానికి సంబంధించిన నాలుగు, లో వోల్టేజ్‌కి సంబంధించి నాలుగు, తరచూ విద్యుత్తు అంతరానికి సంబంధించి మూడు, వ్యవసాయ విద్యుత్ సంబంధించి రెండు, విద్యుత్తు సంబంధించి ఇతర సమస్యలు గురించి 26, మొత్తం 44 ఫోన్ కాల్స్ వచ్చాయని చిన్న చిన్న సమస్యలన్నీ వెంటనే పరిష్కారం చేస్తామన్నారు. ఇతర సమస్యలను పరిష్కరించి వినియోగదారులకు వీలైనంత త్వరలో నాణ్యమైన విద్యుత్తును అంతరాయం లేకుండా అందించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

పంటల బీమాపై అవగాహన కల్పించండి

ప్రజాశక్తి-సి బెళగల్ : పంటల బీమాపై రైతులకు అవగాహన క్షేత్రస్థాయిలో కల్పించాలని ఎఒ మల్లేష్ కుమార్ సంబందించిన వ్యవసాయ సిబ్బందిని కోరారు. బుధవారం సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఇక్కడే మిరపకు ఎకరాకు రూ 360, వరికి రూ 80, ఉల్లికి రూ 90, కందికి రూ 44 ఇలా చెల్లించి బీమా పత్రం పొందాలన్నారు. పంటలు అతివృష్టి గాని, అనావృష్టి గాని సంబవిస్తే పెట్టిన పెట్టుబడుల నుండి బీమా పరిహారం అందుకోవచన్నారు. అందుకే అవగాహన క్షేత్ర స్థాయిలో కల్పించి రైతులకు అందుబాటులో ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది వెంకటేశ్వర్లు, ఈశ్వర్, రైతులు పాల్గొన్నారు.

వొకేషనల్ కళాశాలలో తిలక్ జయంతి

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

కర్నూల్ నగరంలోని స్థానిక బి క్యాంప్ ప్రభుత్వ బాల గంగాధర తిలక్ జయంతి వేడుకలు నిర్వహించారు. వొకేషనల్ జూనియర్ కళాశాలలో బుధవారం ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్. నాగస్వామి నాయక్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వచ్చిన రిటైర్డ్ ప్రిన్సిపల్ కొట్టె చెన్నయ్య , నేషనల్ హ్యూమన్ రైట్స్ సోషల్ జస్టిస్ కౌన్సిల్ ఇండియా జనరల్ సెక్రటరీ రాయపాటి శ్రీనివాస్ మాట్లాడారు. విద్యార్థులు స్వాతంత్ర పోరాటంలో ఉద్యమించిన మహనీయుల జీవిత చరిత్రలను తెలుసుకోవాలన్నారు. నేషనల్ హ్యూమన్ రైట్స్ సోషల్ జస్టిస్ కౌన్సిల్ ఇండియా సంస్థ జనరల్ సెక్రటరీ రాయపాటి శ్రీనివాస్ చేతుల మీదుగా రవీంద్ర నాథ్ ఠాగూర్ నేషనల్ అవార్డు ఫర్ ఎడ్యుకేషనల్ లీడర్ షిప్ అవార్డును ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్.నాగస్వామి నాయక్ అందుకున్నారు. కార్యక్రమంలో కళాశాల లెక్చరర్స్ రామకృష్ణ, విజయశేఖర్, మల్లికార్జున, కృష్ణమోహన్, సోమేష్, ఉల్గోజి రావు, చిన్న మల్లేశ్వరుడు , విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.



తిలక్ చిత్రపటానికి నివాళ్లులర్పిస్తున్న దృశ్యం

ఉత్సాహంగా సుపరిపాలనలో తొలి అడుగు

ప్రజాశక్తి -కోడుమూరు రూరల్ : కోడుమూరు మండలంలో సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమం ఉత్సాహంగా సాగుతోంది. ప్రతి ఇంటికి వెళ్లి ప్రజల సమస్యలను తెలుసుకుంటున్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల గురించి వివరిస్తున్నారు. బుధవారం కోడుమూరు పట్టణంలో ఎస్‌సి కాలనీలో 229 బూత్‌లో డోర్‌టుడోర్ కార్యక్రమం నిర్వహించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు కర్నూలు కెడిసిసి బ్యాంక్ చైర్మన్ విష్ణువర్ధన్ రెడ్డి ఆదేశాల మేరకు కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి ఆదేశాల మేరకు ఒకటో వార్డులో డోర్ టు డోర్ కార్యక్రమం నిర్వహించారు. మాల మునిస్వామి, ఎస్.రామకృష్ణ, మాల కేశవరావు, కొప్పుల రవి, ఎర్రన్న తదితరులు పాల్గొన్నారు.



కరపత్రాలను పంపిణీ చేస్తున్న నాయకులు

వైసిపి సొసైటీలను నాశనం చేసింది

హెచ్ కైరవాడి సొసైటీ అధ్యక్షుడిగా తిమ్మారెడ్డి -ప్రమాణ స్వీకార సభలో ఎమ్మెల్యే బివి

ప్రజాశక్తి - గోనెగండ్ల

సహకార సొసైటీలను వైసిపి ప్రభుత్వం నాశనం చేసిందని ఎమ్మిగనూరు ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి ఆరోపించారు. మండల పరిధిలోని హెచ్ కైరవాడి వ్యవసాయ సహకార పరపతి సంఘం అధ్యక్షుడిగా కైరవాడి గ్రామానికి చెందిన టిడిపి సీనియర్ నాయకుడు బి.తిమ్మారెడ్డి ప్రమాణ స్వీకారం చేశారు. బుధవారం కైరవాడి సొసైటీ ఆవరణలో నిర్వహించిన త్రిసభ్య కమిటీ ప్రమాణ స్వీకార కార్యక్రమానికి ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వర్‌రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా టిడిపి గ్రామ కమిటీ ఆధ్వర్యంలో మేళతాళాలు బాణ సంచాలతో దారి పొడుగునా పూలవర్షం కురిపిస్తూ ఎమ్మెల్యేకు ఘన స్వాగతం పలికారు. అనంతరం సొసైటీ అధ్యక్షుడిగా తిమ్మారెడ్డి డైరెక్టర్లుగా ఆనందం, బి.పెద్ద వెంకటరాముడుల చేత ఎమ్మెల్యే ప్రమాణ స్వీకారం చేయించారు. అనంతరం ఎమ్మెల్యే బివి జయ నాగేశ్వరరెడ్డి మాట్లాడుతూ రైతులకు చేయూతనందించడంలో సహకార సొసైటీల పాత్ర కీలకమైనదని అలాంటి సొసైటీలలో రైతుల ప్రయోజనాలను పూర్తిగా విస్మరించి సొసైటీలను నాశనం చేసిన ఘనత గత వైసిపి ప్రభుత్వానిదే అని విమర్శించారు. రాష్ట్ర ప్రజల ప్రయోజనాల కోసం ప్రభుత్వాన్ని ఎత్తిచూపి హుందాగా వ్యవహరించాల్సిన మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి పూటకో మాట మారుస్తూ రప్పారప్పా అనే రెచ్చగొట్టే మాటలతో రాష్ట్ర ప్రజలకు క్యాన్సర్‌లా తయారయ్యాడని అన్నారు. కొత్తగా ఎన్నికైన సొసైటీ అధ్యక్షుడు డైరెక్టర్లు రైతుల ప్రయోజనాలు కాపాడుతూ సొసైటీని అభివృద్ధి చేయాలని దానికి ముఖ్యమంత్రి సహకారంతో తన వంతు సహకారం అందిస్తూ ఉంటానని అన్నారు. కార్యక్రమంలో టిడిపి మండల కన్వీనర్ తిరుపతయ్య నాయుడు గోనెగండ్ల సొసైటీ అధ్యక్షుడు ఎన్వి రామాంజనేయులు మార్కెట్ యార్డ్ చైర్మన్ మల్లయ్య టిడిపి నాయకులు బేతాళ బడేసా రాజేష్ నాయుడు మహల్ రహమతుల్లా,రంగస్వామి నాయుడు,గురునాథరెడ్డి,రాజేష్ నాయుడు, పెద్దయ్య,రామనరసప్ప గౌడు, కోడుమూరు బ్యాంక్ మేనేజర్ సి అయ్యస్వామి, సూపర్వైజర్ విక్రమసింహారెడ్డి సొసైటీ సీఈఓ ప్రకాష్ రెడ్డి, సిబ్బంది దినేష్ రెడ్డి, జి హనుమంతు, నరహరి గౌడు పాల్గొన్నారు.



హెచ్ కైరవాడి సొసైటీ అధ్యక్షుడిగా తిమ్మారెడ్డి ప్రమాణస్వీకారం చేయిస్తున్న బీవీ

సిసి రోడ్డు ప్రారంభించిన ఎమ్మెల్యే : గ్రామంలో హుసెన్ బి ఇంటి నుంచి పెద్ద కిష్టయ్య ఇంటి వరకు బోయ ఎల్లప్ప ఇంటి నుంచి వడ్డేశ్వరమ్మ ఇంటి వరకు సుమారు రూ.35 లక్షలతో నిర్మించిన సిసి రోడ్డు డ్రైనేజీ సంబంధించిన శిలాఫలకాన్ని ఆవిష్కరించి రిబ్బన్‌కట్ చేసి ప్రారంభించారు. కార్యక్రమంలో తహశీల్దార్ రాజేశ్వరి, ఎంపిడిఒ మణిమంజరి, కాంట్రాక్టర్ షేక్షావలి, డిఇ చంద్రశేఖర్, ఎఇ శంకర్ ఆర్డబ్ల్యుఎస్ ఎఇ శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.



సిసి రోడ్డు పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే జయనాగేశ్వరరెడ్డి

జింకలబారి నుంచి పంటలను కాపాడండి

ఎపి రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రామకృష్ణ

ప్రజాశక్తి-ఎమ్మిగనూరు

కర్నూలు జిల్లాలో జింకల బెడద వలన రైతులను కాపాడాలని ఆంధ్ర ప్రదేశ్ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జి రామకృష్ణ డిమాండ్ చేశారు . బుధవారం ఎమ్మిగనూరులో జరిగిన జిల్లా కమిటీ సమావేశానికి జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్వర్లు అధ్యక్షతన రైతు సంఘం జిల్లా కమిటీ సమావేశం నిర్వమించారు. ఈ సందర్భంగా జి. రామకృష్ణ మాట్లాడుతూ రైతులు పంటలు లేక ఇబ్బంది పడుతుంటే వర్షాలు ఎప్పబడతాయని ఎదురుచూస్తుండగా వేసిన విత్తనాలను జింకలు తినడం వలన పెట్టిన పెట్టుబడి కోల్పోయి తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారన్నారు. 2014 సంవత్సరంలో నాటి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దేవరగట్ట దగ్గర జింకల పార్కు ఏర్పాటు చేస్తారని హామీ ఇచ్చారన్నారు. హామీ హామీగానే మాత్రమే మిగిలిందన్నారు. ఇంతవరకు పరిష్కారం కాలేదన్నారు. జగన్మోహన్ రెడ్డి అధికారంలోకి వచ్చినప్పుడు మంత్రాలయం దగ్గర పెడతానని చెప్పారన్నారు. అధికారంలోకి వచ్చిన నాయకులు వాగ్దానాలు చేయడం తప్ప రైతుల సమస్యల పరిష్కారం చేయలేమనడానికి ఇదో చక్కని నిదర్శనమన్నారు. రైతులు రాత్రింబవళ్లు మేల్కోవాల్సింది వస్తుందన్నారు. వర్షాలు లేవు పంటలేవ్ వేసిన విత్తనాన్ని మొలకెత్తిన వెంటనే జింకలు మేసేస్తున్నాయని, అరికట్టడానికి ఫారెస్ట్ అధికారులు జిల్లా అధికారులు జోక్యం చేసుకొని , జింకలు రైతుల పంట పొలాల బారిన పడకుండా చర్యలు తీసుకొని రైతులను కాపాడాలని కోరారు. యూరియా కొరత వల్ల రైతులు ఇబ్బంది పడుతున్నారని, జిల్లాలో ఇప్పుడిప్పుడే వర్షాలు పడుతున్న తరుణంలో యూరియా కొరత వల్ల రైతులు ఆందోళన చెందుతున్నారన్నారు. ప్రభుత్వం వెంటనే యూరియా కొరత లేకుండా తగిన చర్యలు తీసుకోవాలన్నారు. డిఎపి యూరియా ఈ కావాలంటే మరొక కాంప్లెక్స్ తీసుకోవాలని అటువంటి ఒత్తిడి రైతుల పైన చేయకూడదన్నారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు సి హనుమంతు, పి హనుమంతు, కె.మల్లయ్య, జిల్లా సహాయ కార్యదర్శిలు కోటకొండ సూరి, ఎ.కృష్ణ జిల్లా నాయకులు హోళగుందవెంకటేశ్వర్లు, ఎమ్మిగనూరు లక్ష్మి నరసయ్య, జి ఆంజనేయులు, నరసింహులు, అయ్యప్ప, మధు రెడ్డి , బడే సాబ్, శ్రీరాములు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎపిరైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రామకృష్ణ

ఐక్యపోరాటాలకు సిద్ధం కావాలి

సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి అంజిబాబు

ప్రజాశక్తి-ఆదోని

ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఐక్య పోరాటాలకు సిద్ధం కావాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండి. అంజిబాబు సూచించారు. సిఐటియు అనుబంధ రంగాల సమావేశం సుందరయ్య భవన్‌లో సిఐటియు పట్టణ అధ్యక్షుడు తిప్పన్న అధ్యక్షతన బుధవారం నిర్వహించారు. సమావేశంలో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి అంజిబాబు మాట్లాడుతూ ఎన్నో పోరాటాలు, ప్రాణత్యాగాలు చేసి 8 గంటల పని విధానం సాధించుకున్నామన్నారు. అధికారంలోకి వచ్చిన బిజెపి, కూటమి ప్రభుత్వం విస్మరించే ధోరణి అవలంబించడం తగదన్నారు. కార్మిక వ్యతిరేక విధానాల అవలంబిస్తూ ఎనిమిది గంటల పని విధానాన్ని రద్దు చేయడాన్ని ఖండిస్తున్నామన్నారు. కార్మిక చట్టాలను రద్దుచేసి నాలుగు లేబర్ కోడలుగా మార్చడం వల్ల కార్మికులకు తీవ్రం నష్టం జరుగుతుందన్నారు. కనీస వేతనాల జీవో ప్రకారం కార్మికులకు వర్కర్లకు జీతాలు పెంచాలన్నారు. పిఎఫ్, ఇఎస్ఐ సదుపాయాలు కల్పించాలని ప్రమాద బీమా నష్టపరిహారం ఇవ్వాలని, తదితర కార్మిక ఉద్యోగ హక్కుల సాధనకు సిఐటియుగా కార్మికులందరూ ఉద్యమించాలన్నారు సిఐటియు కార్యదర్శి పిఎస్‌గోపాల్, సహాయ కార్యదర్శి లక్ష్మన్న, ఉపాధ్యక్షులు కృష్ణమూర్తి, హనుమంతు, హమాలి యూనియన్ నాయకులు రంగా, చాంద్‌బాషా, గోవిందు ,రాజు వున్నారు



సమావేశంలో మాట్లాడుతున్న సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి అంజిబాబు

జన హృదయనేత బాల నాగిరెడ్డి

ఘనంగా ఎమెల్యే జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి కౌతాళం

మంత్రాలయం ఎమ్మెల్యే వై బాలనాగిరెడ్డిని అభిమానులు జన జనహృదయనేతగా అభివర్ణించారు. మండల కన్వీనర్ వై దేశయ్ ప్రహ్లాద చారి. బుధవారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్యే వై బాలనాగిరెడ్డి జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే అందించిన సేవలు ప్రజల హృదయాల్లో నిలిచిపోతాయన్నారు. నమ్మిన వారికి ఆయన హృదయంలో స్థానం పొందినట్లేనని పేర్కొన్నారు. కేక్ కట్ చేసి జన్మదిన వేడుకల సంబరాలు జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచి పాల్ దినకరన్, మాజీ సర్పంచి అవతారం, ఉప సర్పంచి తిక్కయ్య, వైస్ ఎంపీపీ బుజ్జి స్వామి, సీనియర్ నాయకులు సత్యప్ప స్వామి, వెంకోబా ,పూజారి లింగన్న, వెంకట్రామరాజు, రాముడు, అబ్దుల్ సమద్, తాహర్ వలి, హుసేని, మూకన్నా తదితరులు పాల్గొన్నారు.

రౌడూర్ గ్రామంలో: మండల పరిధిలోని రౌడూరు గ్రామంలో వైసిపి మండల ప్రధాన కార్యదర్శి సుధాకర్ రెడ్డి ఆధ్వర్యంలో ఎమ్మెల్యే వై బాల నాగిరెడ్డి జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రతి కార్యకర్త గుండెల్లో ఎమ్మెల్యే వై బాల నాగిరెడ్డి ఉన్నారని పేర్కొన్నారు. కేకును కట్ చేసి ఎమ్మెల్యే వై బాలనాగిరెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు మల్లికార్జున రెడ్డి సోమురెడ్డి, లక్ష్మన్న, గంగన్న, వీరేష్,అల్లయ్య, ముఖేష్, వీరేష్, వినోద్, పాల్గొన్నారు. వివిధ గ్రామాలలో జన్మదిన వేడుకలు పండగల జరిపారు.





ఉరుకుంద దేవస్థానం అధికారిపై సబ్ కలెక్టర్ కు ఫిర్యాదు

ప్రజాశక్తి-ఆదోని

విద్యుత్ ఉద్యోగుల పట్ల చులకన భావన ప్రదర్శిస్తూ ఉరుకుంద దేవస్థానం డిప్యూటీ కమిషనర్ దుర్భాషలాడారని కౌతాళం విద్యుత్ శాఖ అసిస్టెంట్ ఇంజనీర్ నరసన్న ఆందోళన వ్యక్తం చేశారు. బుధవారం మౌర్య భరద్వాజకు ఆదోని మంత్రాలయం అదనపు డిఇలు పురుషోత్తం, శాంతి స్వరూప్‌తో కలిసి ఫిర్యాదు చేశారు. అంతకుముందు సబ్ కలెక్టర్ కార్యాలయం ముందు ఘటన గల వివరాలను వెల్లడించారు. ఉరుకుంద నరసింహస్వామి దేవాలయం ఆవరణలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు స్తంభాలు ఏర్పాటు చేయాలని దేవస్థానం ఉత్సవాల కోఆర్డినేషన్ సమావేశంలో ఆలయ డిప్యూటీ కమిషనర్ కోరారని అన్నారు. అంచనాల మేరకు అమౌంటు చెల్లించాలని సూచించగా నిర్లక్ష్యంగా తిరస్కరించారన్నారు. దేవాలయం తరపున ఎలాంటి అమౌంటు చెల్లించబోమని భక్తులు అసౌకర్యానికి గురైతే విద్యుత్ శాఖ అధికారుల బాధ్యులు అంటూ మాట్లాడారన్నారు. ట్రాన్స్‌ఫార్మర్ చేయిస్తామని సస్పెండ్ చేయిస్తామని భయపెడుతూ కించపరిచేలా మాట్లాడి తమ మనోభావాలను దెబ్బ తినేలా వ్యవహరించారని విద్యాశాఖ అసిస్టెంట్ ఇంజనీర్ నరసన్న తెలిపారు. ఈ విషయాన్ని విద్యుత్ శాఖ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లామని జరిగిన అవమానాన్ని విన్నవించగా ఫిర్యాదు చేయాలని సూచించారన్నారు. ఘటనపై ఫిర్యాదు తీసుకోవాలని కౌతాళం సిఐకి విన్నవించినా తిరస్కరించారని తెలిపారు. సాటి ఉద్యోగుల పట్ల ఉరుకుంద ఈరన్న స్వామి దేవాలయం డిప్యూటీ కమిషనర్ దురుసుగా మాట్లాడడం తగదని న్యాయం చేయాలని కోరారు. సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ స్పందిస్తూ ఘటన పై విచారణ జరిపిస్తామని ట్రాన్స్‌ఫార్మర్ ఇతర సామాగ్రికి ప్రతిపాదన మేరకు అమౌంట్ చెల్లించేలా చూస్తామని నచ్చచెప్పారు. సమస్య మరోసారి పునరావృతం కాకుండా చూస్తామని హామీ ఇచ్చారని విద్యుత్ శాఖ ఉద్యోగులు తెలిపారు.



ఫొటో విధానాన్ని రద్దు చేయాలి

ప్రజాశక్తి-ఆదోనిరూరల్

ఉపాధి హామీ చట్టంలో రెండుపూటల ఫోటో అప్లోడ్ విధానాన్ని రద్దు చేయాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు కె.లింగన్న ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం మండలం పరిధిలో పాండవగల్లు గ్రామంలో కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టంలో పనిచేస్తున్న కూలీలు ఉదయం తొమ్మిది గంటలకు, సాయంత్రం నాలుగు గంటలకు రెండుసార్లు ఫొటో అప్లోడ్ చేయాలని నిబంధనను వెంటనే రద్దు చేయాలన్నారు. ప్రభుత్వం ఎలాంటి నైపుణ్యం లేని పనులను ఉపాధి హామీ చట్టంలో కల్పించాల్సి ఉన్నప్పటికీ ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేయాలనే కుట్రలో భాగంగా ఈ విధానాన్ని తీసుకొచ్చిందని అన్నారు. ఈ నిబంధన అమల్లోకి వస్తే ఉపాధి హామీ కూలీలు పనులకు దూరం కావలసిన పరిస్థితి ఏర్పడుతుందన్నారు. ఇప్పటికే ఒకపక్క చేసిన పనికి డబ్బులు చెల్లించకుండా ఆలస్యం చేస్తూ మరోవైపు ఇలాంటి నిబంధనలు అమలు చేయడం ఉపాధి హామీని పేదలకు దూరం చేయాలనే కుట్రలో భాగమేనని విమర్శించారు. ఈ కుట్రలకు వ్యతిరేకంగా ప్రజలు అప్రమత్తం కావాలన్నారు. ఈ మావేశంలో సిఐటియు మండల అధ్యక్షులు జె.రామాంజనేయులు, రైతు సంఘం మండల అధ్యక్షులు శేఖర్, వ్యవసాయ కార్మిక సంఘం మండల నాయకులు పాండురంగ, గోవిందు, గ్రామ నాయకులు తాయప్ప, ఉసేని, నరసయ్య పాల్గొన్నారు.



మాట్లాడుతున్న లింగన్న

ఖాళీ కుర్చీలతో సర్వసభ్య సమావేశం...

ప్రజా సమస్యలపై మాట్లాడే ప్రజా ప్రతినిధులు డుమ్మా....

ప్రజాశక్తి-ఆలూరు




ఆలూరు మండల సర్వసభ్య సమావేశం బుధవారం ఖాళీ కుర్చీలతో తూతూ మంత్రంగా జరిగింది. ప్రతి మూడు నెలల కోసారి మండలం లోని సమస్యలపై, అభివృద్ధి కార్యక్రమాలపై జరిగే మండల సర్వసభ్య సమావేశం ఎంపిపి జె.రంగమ్మ అధ్యక్షతన నిర్వహించారు. సమావేశానికి జడ్‌పిటిసి ఏరురు చంద్రశేఖర్, ఎంపిడిఒ మద్దిలేటిస్వామి, తహసీల్దార్ జిపిశోభ, సువర్ణమ్మ, ఆయా శాఖల అధికారులు హాజరయ్యారు. మండలంలో 16 మంది ఎంపిటిసిలకు గాను ఒకరు మృతి చెందగా 15 మందిలో ఏడుగురు మాత్రమే హాజరయ్యారు. 16మంది సర్పంచులకు గాను ఇద్దరు హాజరయ్యారు. ఇద్దరు మహిళా సర్పంచుల స్థానంలో కుటింబీకులు హాజరయ్యారు. మండల ప్రజా ప్రతినిధులు ప్రజల సమస్యలపై మాట్లాడేందుకు ఎంత మక్కువ చూపుతున్నారో అర్థమౌతుంది. వీరుపాపురం స్కీమ్ నుండి ముద్దనగేరి గ్రామానికి 15 రోజులైన తాగు నీరు రావడంలేదని, ఆలూరు పట్టణంలో 10 నుండి 15 రోజులకు నీరు అందిస్తున్నారని అధికారులు ఉన్నారా లేరా అని సర్పంచి సుధాకర్, జడ్‌పిటిసి ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్ఇ రామ్ లీలను నిలదీశారు. ముద్దనగేరి గ్రామ రెవెన్యూ పరిధిలో సప్తగిరిరెడ్డికి చెందిన 4.99 ఎకరా పోలములోరి సర్వేలో 1.50ఎకరాలు మాత్రమే ఆన్ లైన్‌లో ఎక్కిందని మిగిలిన పొలం ఎక్కించాలని ఎన్నిసార్లు ఫిర్యాదు చేసిన పట్టించుకోవడం లేదని,తక్కువ ఇద్దరి పిల్లలకు తల్లికి వందనం రాకపోవడంతో విచారించగ తాను ఉద్యోగి, తన పేరుపై 12ఎకరాలు పొలం ఉన్నట్లు చూపిస్తుందని నాకు 4 ఎకరాలే ఉందని సర్పంచి సుధాకర్ అధికారుల ముందు వాపోయారు. ప్రజా ప్రతినిధులకే పని జరగకపోతే సామాన్య ప్రజల సంగతేంటని ప్రశ్నించారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

ప్రజాశక్తి-ఆస్పరి

గ్రామంలో ప్రజలు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఎంపిడిఒ గీతావాణి అన్నారు. బుధవారం మండల పరిధిలోని కారుమంచి గ్రామాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ మాట్లాడుతూ గ్రామంలో చెత్తను ఎక్కడ పడితే అక్కడ వేయడం వల్ల వర్షాకాలం కావడంతో దోమలు వృద్ధి చెంది పిల్లలు, వృద్ధులు అనారోగ్యాల బారిన పడే అవకాశం ఉందన్నారు. ఎక్కడపడితే అక్కడ చెత్త పారి వేయరాదని, బాత్రూం నీళ్లు కూడా రోడ్లపైకి తిప్పరాదన్నారు. అలా ఎవరైనా చేస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రతి కాలనీకి చెత్తబండ్లు వస్తాయని వేస్ట్‌తడి,పొడి చెత్తను అందులో వేయాలని ప్రజలకు సూచించారు. డ్రైనేజీ కాలువలు తీయించి శానిటేషన్ వేయాలని పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు. గ్రామాలలో ప్రజల నుండి ఫిర్యాదులు రాకుండా పంచాయతీ కార్యదర్శులు విధులు సక్రమంగా నిర్వహించాలన్నారు. పంచాయతీ కార్యదర్శి సురేష్ పాల్గొన్నారు.



పారిశుధ్య పనులను పర్యవేక్షిస్తున్న ఎంపిడిఒ

రైతులకు సూచలిచ్చే వారేరి...?

- **కానరాని వ్యవసాయశాఖ అధికారి**
- **అగ్రికల్చర్ అసిస్టెంట్లు పోయే వారే కానీ... వచ్చేవారు ఎక్కడ**
- **రైతుల ఆవేదన**

ప్రజాశక్తి-చిప్పగిరి

ఖరీఫ్‌సీజన్‌లో రైతన్నకు సరైన వ్యవసాయ సూచనలు ఇచ్చేవారు కరవయ్యారు. వ్యవసాయ శాస్త్రవేత్తలు, అనుభవమున్న వ్యవసాయ అధికారులు సలహాల మేరకు చాలామంది రైతులు ప్రతి ఏటా వారు ఇచ్చిన సహాలమేరకే పంటలు దిగుబడి సాధిస్తున్నారు. చిప్పగిరి మండలంలో సాధారణ బదిలీలలో భాగంగా వ్యవసాయ శాఖ అధికారిగా పనిచేస్తున్న జయలక్ష్మి ఆదోనికి వెళ్లిపోవడంతో ఇప్పటివరకు చిప్పగిరి మండలానికి వ్యవసాయ శాఖ అధికారిగా ఉన్నతాధికారులు నియమించలేదని చాలామంది రైతులు ఆవేదన చెందుతున్నారు. అధికారి ఉన్నప్పుడు ప్రతి గ్రామం తిరిగి రైతులకు అగ్రికల్చర్ అసిస్టెంట్లతో అవగాహన కల్పించి రైతులకు ఎప్పటికప్పుడు ఫలానా ఎరువులు, మందులు వాడాలి. ఫలానా విత్తనాలు వాడాలని చెప్పేవారని రైతులు పేర్కొంటున్నారు. ముఖ్యంగా మండలంలో బదిలీలలో అగ్రికల్చర్ అసిస్టెంట్లుగా పని చేస్తున్న ఎక్కువమంది వేరే మండలాలకు బదిలీలు అయ్యారు. కానీ చిప్పగిరి మండలానికి వచ్చే వారే లేరని చాలామంది రైతులు ఆవేదన చెందుతున్నారు. ప్రతి రైతు సేవా కార్యాలయంలో అగ్రికల్చర్ అసిస్టెంట్లు ఉన్నట్లయితే వారితో వ్యవసాయంపై పలు సూచనలు అడిగి తెలుసుకునే వారమని రైతులు తెలుపుతున్నారు. ఇప్పటికైనా రైతులకు సూచనలు, సలహాలు ఇచ్చేందుక వ్యవసాయ శాఖ అధికారిని , రైతు సేవా కార్యాలయంలో పనిచేస్తున్న అగ్రికల్చర్ అసిస్టెంట్లను మా మండలానికి నియమించాలని జిల్లా కలెక్టర్‌న, సంబంధిత ఉన్నతాధికారులను రైతులు కోరుతున్నారు.



రైతులకు సలహాలు ఇచ్చే వారే లేరు: గోవిందు



వ్యవసాయ రంగంలో మంచి దిగుబడులు సాధించాలంటే తప్పనిసరిగా వ్యవసాయ శాఖ అధికారులు సహకారం తీసుకుంటేనే మంచి పంటలు పండుతాయని చాలామంది రైతులకు తెలుసు. అయితే మా మండలంలో రైతులకు సరైన సూచనలు సలహాలు ఇచ్చేవారు కరవయ్యారు. ఇప్పటికైనా ఖాళీగా ఉన్న వ్యవసాయ శాఖ అధికారిని, రైతు సేవ కార్యాలయంలో పనిచేస్తున్న అగ్రికల్చర్ అసిస్టెంట్లను నియమించాలని అధికారులను కోరుతున్నాం.

అవసరం లేని చోట తనిఖీలెందుకు

తనిఖీకి వెళ్లిన అధికారులకు...విద్యార్థి తల్లిదండ్రుల షాక్

ప్రజాశక్తి-ఆదోనిరూరల్

పట్టణ కల్లుబావి సమీపంలో ఉన్న కస్తూరిబాయి గాంధీ బాలికల విద్యాలయ ప్రిన్సిపల్ పై ఫిర్యాదు వచ్చిందని తనిఖీకి వచ్చిన డిప్యూటీ డిఇఒ వెంకట రమణారెడ్డి, ఎంఇఒ-2 శ్రీనివాసులుకు విద్యార్థి తల్లిదండ్రులు షాకిచ్చారు. బుధవారం స్థానిక కెజిబివి కళాశాలలో విద్యాశాఖ అధికారులు మాట్లాడుతూ డిఇఒ ఆదేశాల మేరకు కెజిబివి కళాశాలలకు తనిఖీలు వచ్చామని విలేకరులకు తెలిపారు. విద్యార్థులకు ఏమైనా ఇబ్బంది ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని డిప్యూటీ విద్యాశాఖ అధికారి తల్లిదండ్రులకు సూచించారు. విద్యాశాఖ అధికారులు పాఠశాలలోని విద్యార్థుల తల్లిదండ్రులతో ముఖాముఖి నిర్వహించారు. విద్యార్థి తల్లిదండ్రులు మాట్లాడుతూ తమ పిల్లలకు ఎలాంటి ఇబ్బంది లేదని ప్రైవేట్ స్కూల్లోకి దీటుగా కెజిబివి పాఠశాలలో ప్రిన్సిపల్ ఉపాధ్యాయులు చదువు చెబుతున్నారని. తమ పిల్లలు ఇళ్లకు రమ్మన్నా రావడంలేదని అంత చక్కగా ప్రిన్సిపల్ చూసుకుంటున్నారని విద్యాశాఖ అధికారికి షాక్ ఇచ్చారు.

అంతా బాగుంది పవిత్ర, ఇంటర్మీడియట్ : కళాశాల ప్రిన్సిపల్ తమతో కుటుంబ సభ్యులులాగా వ్యవహరిస్తున్నారని. తమకు ఎలాంటి ఇబ్బంది వచ్చినా దగ్గరుండి మేడం పరిష్కరిస్తున్నారని తమకు ఎలాంటి ఇబ్బంది లేదని తెలపారు.

రాజకీయ కారణాలతో కెజిబివి ప్రిన్సిపల్ పై కుట్రలు: నాగరాజు విద్యార్థి తండ్రి

రాజకీయ పలుకుబడి కలిగిన ఒక వ్యక్తి వేరే మనుషులతో ఉత్తరాలు ఉన్నత స్థాయి అధికారులకు పంపిస్తున్నారని, ఈ విషయం విద్యార్థి తల్లిదండ్రులకు అందరికి తెలుసుని, ఇది ఇలాగే కొనసాగితే ఆ రాజకీయ పలుకుబడి కలిగిన వ్యక్తి ఇంటిని ముట్టడిస్తామని హెచ్చరించారు.

ఒక ఉత్తరంతోనే కెజిబివి కళాశాలకు తరలివచ్చారు

దానపురం ఉదయ్ విద్యార్థి సంఘం నాయకుడు

మండల పరిధిలో ఉన్నటువంటి ప్రభుత్వ కళాశాలలు ప్రభుత్వ పాఠశాలలో ప్రైవేట్ పాఠశాలల్లో ఎన్నో సమస్యలు ఉన్నాయని ఆ సమస్యను ఎన్నోసార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లిన స్పందించలేదని అయితే కెజిబివి పాఠశాల ఆదోనిలోనే ఉత్తమ చదువును అందిస్తోందని ఎందరో విద్యార్థులు ఎంతో ఉత్తీర్ణత సాధించారని దీనికి కృషి చేస్తున్న ప్రిన్సిపాల్‌ను రాజకీయ కారణాలతో ఇబ్బందులు గురి చేసే కుట్ర జరుగుతోందని ఆరోపించారు. మేము ఎన్నో వినతి పత్రాలు ఇచ్చినా పరిష్కరించని అధికారులు ఒక ఉత్తరంతోనే తనిఖీకొచ్చారు అధికారులు.





మాట్లాడుతున్న సి.గోవిందు

అచ్యుతానందన్ ఆశయ సాధనకు కృషి

ఫ్రజాశక్తి-ఎమ్మిగనూరు

కేరళ మాజీ ముఖ్యమంత్రి విఎస్.అచ్చుతానందన్ ఆశయ సాధనకు కృషి చేయడమే ఆయనకిచ్చే నివాళి అని సిపిఎం మండల కార్యదర్శి సి.గోవిందు అన్నారు. ఆయన మృతికి నివాళులర్పిస్తూ, సంతాప సభ బుధవారం పట్టణంలోని స్థానిక సుందరయ్య భవన్‌లో నిర్వహించారు. సిపిఎం డివిజన్ కార్యదర్శి సి. గోవిందు , సిపిఎం నాయకులు రాముడు అచ్యుతానందన్ చిత్రపటానికి పూలమాల వేశారు. సిపిఎం కార్యకర్తలు లక్ష్మీనరసయ్య, కృష్ణ, రమేష్, సురేష్, నివాళి అర్పించారు. గోవిందు మాట్లాడుతూ కేరళ ముఖ్యమంత్రిగా, పోలిట్ బ్యూరో సభ్యులుగా అచ్యుతానందన్ గారి నిర్మాణ దక్షత, ప్రజల పట్ల అకుంఠితమైన దీక్షను కొనియాడారు. జమీందారీ వ్యతిరేక పోరాటంలో జైలు కెల్లారని, నిర్బంధాలకు వ్యతిరేకంగా ప్రజా పోరాటాలు నిర్వహించారని, నిర్బంధాల సందర్భంగా అజ్ఞాతవాసం చేశారని తెలిపారు. పదహారేళ్ళ వయసులోనే స్వాతంత్ర పోరాటంలో పాల్గొన్నారన్నారు. 80 ఏళ్లు సిపిఎంకు ప్రజలకు తన జీవితాన్ని అంకితం చేసిన మహనీయుడు అని కొనియాడారు. నామాల రాముడు, వలి, రఘునాథ్, మాదన్న, చేనేత సంఘం నాయకులు కాళప్ప, కెవిపిఎస్ నాయకులు గుంటప్ప భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు తిమ్మప్ప, మేధావులు, ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

పోరాటంతోనే హక్కులు సాధిస్తాం

సిఐటియు జిల్లా అధ్యక్షులు పిఎస్.రాధాకృష్ణ

ప్రజాశక్తి-మద్దికేర

పోరాటాలు నిర్మించడం, వాటిని ముందుకు తీసుకెళ్లడంలో సిఐటియు ముందు వరుసలో నిలుస్తుందని సిఐటియు జిల్లా అధ్యక్షులు రాధాకృష్ణ తెలిపారు. మద్దికేరలో సిఐటియు మండల కార్యదర్శి బురుజుల రాముడు అధ్యక్షతన మండల కమిటీ సమావేశం బుధవారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మూడో సారి ప్రధానమంత్రిగా నరేంద్ర మోడీ గెలిచాక కార్మికవర్గం కష్టాలు తీర్చకుండా, దేశానికి బ్యాంకులకు ఎగనామం పెట్టే దోపిడీదారుల కష్టాలు ఆలోచిస్తున్నారని అన్నారు. అతి తక్కువ జీతాలతో పని చేస్తున్న మధ్యాహ్న భోజనం నిర్వాహకులు, స్వీపర్లు, విఆర్ఎలు, అంగన్వాడీ, ఆశా,ఇలా అనేకమంది అసంఘటిత రంగంలో రోజువారి కనీస కూలి కూడా లేని పరిస్థితి రాష్ట్రంలో దేశంలో ఉందని, వీరిగురించి పాలకులు ఆలోచించడంలేదని విమర్శించారు. సిఐటియు అనుబంధ సంఘాలు, ప్రభుత్వం నుండి వచ్చే హక్కులను, ఐకమత్యంతో పోరాడి సాధించుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఎం శాఖ కార్యదర్శి కడవల రవికుమార్, సిఐటియు అనుబంధ సంఘాల నాయకులు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



కుట్టు మిషన్లు పంపిణీ చేస్తున్న టిడిపి నాయకులు

మహిళల ఆర్థికాభివద్ధికి కుట్టు మిషన్లు పంపిణీ

ప్రజాశక్తి -దేవనకొండ

మహిళలను ఆర్థికంగా అభివృద్ధి చేయడానికి ఉచితంగా టైలరింగ్ నేర్పించి 50శాతం సబ్సిడీతో కుట్టు మిషన్లు అక్షిత ఫౌండేషన్ ఆధ్వర్యంలో బుధవారం మండల కేంద్రమైన దేవనకొండలో100 కుట్టు మిషన్లు పంపిణీ చేశారు. రాష్ట్ర వాల్మీకి కార్పొరేషన్ చైర్మన్ కప్పట్రాళ్ల బొజ్జమ్మ, మండల టిడిపి కన్వీనర్ విజయభాస్కర్ గౌడ్ అన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పేద మహిళలకు టైలరింగ్ ఉచితంగా నేర్పించి కుట్టు మిషన్లు అందించడం జరుగుతుందని ఈ అవకాశాన్ని మహిళల సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపిపి రామచంద్ర నాయుడు టిడిపి నాయకులు మాజీ సర్పంచి ఉచ్చీరప్ప, రామారావు నాయుడు, రాజశేఖర్ గౌడ్, మల్లికార్జున గౌడ్, పి.కోటకొండరంగడు, ఎఫ్ఆర్ హైస్కూల్ కరస్పాండెంట్ రఘునాథ్, పాల్గొన్నారు..



రసాయనిక ఎరువుల వాడకాన్ని తగ్గించాలి

ప్రజాశక్తి -దేవనకొండ

పంటల దిగుబడుల్లో రసాయనిక ఎరువుల వాడకాన్ని తగ్గించాలని భారత గ్రామీణ నవ నిర్మాణ సంస్థ ఏరియా మేనేజర్ నవ్య, పియు మేనేజర్ ఇంతియాజ్ పేర్కొన్నారు. ల బెటర్ కాటన్ ఆధ్వర్యంలో బుధవారం స్థానిక రైతు సేవా కేంద్రంలో రైతులకు నేల ఆరోగ్యం మరియు ఎరువుల యాజమాన్యం నిర్వహణ పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రత్తి పంటలో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలు మరియు మట్టి పరీక్ష యొక్క ప్రాముఖ్యత ,ఎరువుల వాడకం గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో మారి సంస్థ ఫీల్డ్ ఫెసిలేటర్లు పాండురంగడు, మలేష్, శ్రీను , శిరి, భాస్కర్ , వివిధ గ్రామాల రైతులు పాల్గొన్నారు.

క్రీడాకారులకు షూష్ పంపిణీ

ప్రజాశక్తి :ఎమ్మిగనూరు

ఎమ్మిగనూరు ఫుట్ బాల్ క్రీడాకారులకు 15 జతల ఫుట్ బాల్ షుస్ ఫుట్ బాల్ క్రీడాకారులకు వైసిపి నాయకులు పాల శ్రీనివాస్ రెడ్డి బుధవారం అందజేశారు. ఈ సహాయ కార్యక్రమంలో రోటరీ క్లబ్ సభ్యులు కె.ఆర్ శ్రీనాథ్ రెడ్డి అధ్యక్షులు, ఏ సుధాకర్ రావు, ప్రధాన కార్యదర్శి,మాచాని నాగరాజు,కోశాధికారి,కేర్ నటరాజ రెడ్డి, ఆర్గనైజర్,కె ఆర్ నరసింహారెడ్డి,కురువ బీరప్ప,మాచాని వెంకటేష్,బైలుప్పల షఫీయుల్లా, మల్లారి సోమశేఖర్, ఎమ్మిగనూర్ ఫుట్బాల్ క్రీడాకారుల ప్రతినిధి ఎస్ షేక్షావలి కలిసి అందజేశారు.

ఇబ్బందులకు గురి చేస్తే సహించం

ప్రజాశక్తి ఆదోని

ప్రభుత్వ శాఖల్లో విధులు నిర్వర్తిస్తున్న ఉద్యోగులను వేధింపులకు గురి చేస్తే ప్రతిఘటిస్తామని నేషనల్ ట్రైబల్ ఫెడరేషన్ రాయలసీమ ఇంచార్జి మోపిరి సూర్య హెచ్చరించారు.బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆదోని నియోజకవర్గంలో ఎస్సి, ఎస్టి ఉద్యోగుల ను టార్గెట్ చేస్తూ కొందరు రాజకీయ నాయకులు బ్లాక్ మెయిల్ చేస్తూ ఇబ్బందులకు గురిచేస్తున్నారు విధులు పట్ల అంకితభావంతో వ్యవహరిస్తున్న కస్తూర్బా గాంధీ విద్యాలయం ప్రిన్సిపల్ శాంతి పట్ల అధికారులతో వేధింపులకు గురి చేయడం తగదన్నారు. పద్ధతి మార్చుకోని పక్షంలో కర్నూలు నుంచి శ్రీకాకుళం వరకు ఎస్టి నాయకులను అప్రమత్తం చేస్తూ ఆదోనిలో జరుగుతున్న గిరిజనులపై దాడులను నిరసిస్తూ ఆదోనిలో త్వరలో నిరసన కారిక్రమం నిర్వహిస్తామని హెచ్చరించారు.

యూరియ కొరకు రైతుల అవస్థలు

ప్రజాశక్తి-నందవరం

యూరియ కొరకు నందవరం మండలం రైతులు అవస్థలు పడుతున్నారు. బుధవారం మండలంలోని వివిధ గ్రామాల రైతులు వ్యవసాయ కార్యాలయము దగ్గర నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడారు. యూరియా కొరకు గత మూడు రోజులుగా నందవరం కార్యాలయాల చుట్టు తిరుగుతు ఉన్నామని తెలిపారు. మూడు రోజులుగా తిరిగిన అధికారులు స్పందించట్లేదని మాపై నిర్లక్ష్యంగా మాట్లాడుతున్నారని రైతులు మండిపడ్డారు. సమాధానం చెప్పకుండా వ్యవసాయ అధికారులు కార్యాలయం నుండి వెళ్లిపోయారని తెలిపారు. తమన కార్యాలయాలయం లోపలికి కూడా రాకుండా బెంచ్ లను అడ్డుగా పెట్టి కార్యాలయం ముందే నిలబెట్టి నిర్లక్ష్యంగా మాట్లాడుతున్నారని రైతులు తెలిపారు. యూరియా కొరత లేదని కొంతమంది నాయకులు మాట్లాడటం హాస్యాస్పదంగా ఉందని రైతులు తెలిపారు. కార్యాలయాల దగ్గరకు వచ్చి తమ బాధను చూస్తే వారికి అర్థమవుతుందని మర్శించారు. నందవరం, కనకవీడు, పేట, మిట్టసోమాపురం.. గ్రామాల రైతులకు యూరియ అందించడంలో అధికారులు చిన్నచూపు చూస్తున్నారని తెలిపారు. ఇప్పటి వరకు 15 లారీల లోడు మండలానికి వచ్చిందని అధికారులు తెలిపారు. వచ్చిన యూరియా ఏ గ్రామాల రైతులకు ఇచ్చారు.వారి



ఎరువుల కోసం వచ్చిన రైతులు

ఆన్‌లైన్ వివరాలను తమకు చూపించాలని రైతులు అధికారులను కోరారు. వారికి సమాధానం చెప్పలేక అధికారులు నీళ్ల నమలటం ఆశ్చర్యానికి గురి చేసింది. ఆన్‌లైన్‌లో స్టాక్ ఉన్నట్లు చూపిస్తుందని అధికారులు తెలిపారు. కానీ గోడౌన్లలో మాత్రం ఒక్క యూరియా సంచి లేకపోవడం విశేషం. యూరియా ఏ దొంగలు ఎత్తుకుపోయారో వారికే తెలియాలంటు రైతులు మండిపడ్డారు. మూడు రోజులుగా కార్యాలయాల చుట్టూ తిరుగుతు ఉన్నామని, మీరు చెప్పిన సమయంలోనే వచ్చి యూరియా తీసుకుంటామని, అప్పటివరకు టోకెన్లు రాసి ఇవ్వండని రైతులు ప్రాధేయపడినా అధికారులు మాత్రం కనికరం లేకుండా రైతులపై విసుకు పడుతున్నారని వారు ఆందోళన చెందుతున్నారు.

ఘనంగా ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి జన్మదిన వేడుక

ప్రజాశక్తి మంత్రాలయం

తెలంగాణా రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌లో ఎమ్మెల్యే వై బాలనాగిరెడ్డి జన్మదినం ఘనంగా నిర్వహించారు. బుధవారం ఎమ్మెల్యే పుట్టిన రోజును పురస్కరించుకుని వైసిపి జిల్లా అధికార ప్రతినిధి పురుషోత్తం రెడ్డి జిల్లా కార్యదర్శి ఈరన్న మంత్రాలయం మండల కన్వీనర్ జి.బీమారెడ్డి పెద్దకడుబూరు మండల కన్వీనర్ రాంమోహన్ రెడ్డి వైసిపి రైతు సంఘం జిల్లా నాయకులు ఐరన్ గల్లు శ్రీనివాస్ రెడ్డి గ్రామ సర్పంచి తెల్లబండ్ల భీమయ్య నాయకులు జనార్ధన్ రెడ్డి వికెసి రఘు, జక్షయ్య, మారెప్ప, అబ్రహం ఇతర మండలాల నాయకులు కార్యకర్తలు తదితరులు హైదరాబాద్ చేరుకొని ఎమ్మెల్యేకు శాలువలతో బొక్కెలు అందజేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేతో కేక్‌కట్ చేయించి ఆయనకు తినిపించి సంబరాలతో శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఆయనతో ఫోటోలు దిగారు. దీనిపై స్పందించిన ఎమ్మెల్యే తనపై అభిమానంతో ఇంత దూరం వచ్చి శుభాకాంక్షలు తెలిపి నందుకు ధన్యవాదాలు తెలిపారు. నిదానంగా తమ తమ వాహనాల్లో ఊళ్ళకు చేరుకున్న తరువాత ఫోన్ చేయాలని అప్పడే తనకు సంతోషమన్నారు.

శాస్త్రీయ విద్యా విధానం అవసరం

ప్రజాశక్తి - గోనెగండ్ల

భారత విద్యార్థి ఫెడరేషన్ ఎస్ఎఫ్ఐ గోనెగండ్ల మండల జనరల్ బాడీ సమావేశం మండల అధ్యక్షులు పవన్ అధ్యక్షతన బుధవారం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా ఎస్ఎఫ్ఐ మాజీ జిల్లా నాయకులు , ఉపాధ్యాయులు బాబు, ఎస్ఎఫ్ఐ కర్నూలు జిల్లా ఉపాధ్యక్షులు సాయి ఉదయ్ మాట్లాడుతూ శాస్త్రీయ విద్యా విధానం కోసం , విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాడుతున్న ఎస్ఎఫ్ఐ కర్నూలు జిల్లా ప్లీనరీ సమావేశాలు జులై 26, 27వ తేదీల్లో ఎమ్మిగనూరులో నిర్వహిస్తున్నామన్నారు. ప్లీనరీ సమావేశాల్లో విద్యారంగంలో నెలకొన్న సమస్యలపై చర్చిస్తామన్నారు. సమస్యల పరిష్కారం కోసం పోరాటాల్లో విద్యార్థులు కూడా చురుగ్గా పాల్గొనాలని అన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు తమ ప్రయోజనం కోసం విద్యారంగాన్ని నాశనం చేసి శాస్త్రీయ విద్యా విధానం విద్యార్థులకు బోధించకుండా కాషాయి విద్యా విధానాన్ని అమలు చేయడం కోసం విద్యారంగంలో అనేక మార్పులు తీసుకొస్తున్నారన్నారు. వాటిని తిప్పి కొట్టడానికి విద్యార్థులు ఏకమై పోరాడాలన్నారు. విద్యార్థుల సమస్యల



పరిష్కారం కోసం నిరంతరం ఎస్ఎఫ్ఐ విద్యార్థులకు అండగా ఉంటుందని అన్నారు. అనంతరం నూతన మండల కమిటీని ఎన్నుకున్నారు. గోనెగండ్ల నూతన మండల అధ్యక్ష కార్యదర్శులు రియాజ్, పవన్ తేజలను కమిటీ సభ్యులుగా, మరో 10 మందిని ఎన్నుకున్నారు.

అధికారిపై జెసి ప్రభాకర్ రెడ్డి వ్యాఖ్యలు సరికాదు

ప్రజాశక్తి కర్నూలు కలెక్టరేట్

అనంతపురం డిపిఒ నాగరాజు నాయుడు పై తాడిపత్రి మున్సిపల్ చైర్మన్ జెసి ప్రభాకర్ రెడ్డి అనుచిత వ్యాఖ్యలు చేయడం తగలదని ఎపి ఎన్‌జిఒ సంఘం జిల్లా అధ్యక్షుడు విసి హెచ్ వెంగల్‌రెడ్డి అన్నారు. బుధవారం కర్నూలులోని స్థానిక ట్రెజరీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వెంగల్ రెడ్డి మాట్లాడుతూ ఇటీవల అనంతపురం జిల్లా తాడిపత్రిలో జిల్లా పంచాయతీ అధికారి నాగరాజు నాయుడు మీద తాడిపత్రి మున్సిపల్ చైర్మన్ జెసి ప్రభాకర్‌రెడ్డి



దుర్భాషలాడాడం నైతికంగా అధికారులను మానసిక ఇబ్బందులకు గురి చేయడమే అన్నారు. భవిష్యత్తులో ఇలాంటి దాడులు జరిగినచో తీవ్రమైన పరిణామాలు రాజకీయ నాయకులు ఎదుర్కొనక తప్పదన్నారు. ఈ సమావేశంలో కర్నూల్ నగర అధ్యక్షులు ఎంసి కాశన్న, నగర కార్యదర్శి రామకృష్ణ, జిల్లా ఇన్‌ఛార్జి కార్యదర్శి కెసిహెచ్ కృష్ణుడు, నగర కార్యవర్గ సభ్యులు ఎంకె. సుజాత, విజయ్‌కృష్ణ, ట్రెజరీ ఉద్యోగుల సంఘం నాయకులు మోహన్, అరవింద్, ఇంకా ఇతర ట్రెజరీ ఉద్యోగులు పాల్గొన్నారు



అచ్యుతానందన్ కు ఘన నివాళి

ప్రజాశక్తి - దేవనకొండ

కమ్యూనిస్టు కురువృద్ధుడు సిపిఎం వ్యవస్థాపక సభ్యులు కేరళ మాజీ ముఖ్యమంత్రి, విఎస్.అచ్యుతానందన్ నేటి తరానికి పోరాటాల స్ఫూర్తి అని సిపిఎం జిల్లా నాయకులు వీరశేఖర్ పేర్కొన్నారు. బుధవారం స్థానిక సిఐటియు కార్యాలయంలో సంతాప సమావేశం ఆ పార్టీ పట్టణ కార్యదర్శి ముక్కెళ్ల అశోక్ అధ్యక్షతన నిర్వహించారు. కార్యక్రమంలో ఆ పార్టీ ప్రజాసంఘాల నాయకులు రమేష్,రాయుడు, బలరాముడు ,వెంకటేష్ ఆచారి, రంగడు, రంగన్న, మహేష్ ,రాము, కార్తీక్, బండ్లయ్య తదితరులు పాల్గొన్నారు.



టివి5 రిపోర్టర్‌ను పరామర్శించిన మాధవరావు దేశాయ్

ప్రజాశక్తి-నందవరం

టివి5 రిపోర్టర్ మక్బుల్‌ను నందవరం టిడిపి నాయకులు మాధవరావు దేశాయ్ బుధవారం పరామర్శించారు. ఆయనకు ప్రమాదవశత్తు కిందపడికాలు ఫ్రాక్చర్ అయింది. విషయం తెలుసుకున్న మాధవరావుదేశాయ్ ఎమ్మిగనూరు ఆయన నివాసానికి చేరుకొని పరామర్శించారు. ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ప్రశాంతంగా ఉంటూత్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. అనంతరం ఆయనకు ఆర్థిక సహాయాన్ని అందించారు.

పండ్ల మొక్కలను సద్వినియోగం చేసుకోవాలి

ఎంపిడిఒ గీతావాణి

ప్రజాశక్తి-ఆస్పరి

జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా అందిస్తున్న పండ్ల మొక్కలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఎంపిడిఒ గీతా వాణి సూచించారు. బుధవారం మండల పరిధిలోని వెంగళాయి దొడ్డి గ్రామంలో రైతు నర్సిరెడ్డి పొలంలో సాగు చేసిన డ్రాగన్ ఫ్రూట్ పంటను ‘రిశీలించారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ మాట్లాడుతూ చిన్న సన్న కార రైతులు లాభసాటి గా ఉండాలనే ఉద్దేశంతో ప్రభుత్వం జామ, సపోటా, డ్రాగన్ ఫ్రూట్, నిమ్మ, దానిమ్మ, కొబ్బరి మొక్కలు ఇస్తున్నారన్నారు. వీటి మధ్యలో అంతర పంటలు వేసుకోవచ్చని అన్నారు. ఐదు ఎకరాలలోపు పొలం ఉండి ఆసక్తి ఉన్న రైతులు తమ పొలం పాస్ బుక్కు, ఆధార్ కార్డు, బ్యాంకుబుక్ జిరాక్స్‌లు తమ గ్రామంలో ఉన్న ఫీల్డ్ అసిస్టెంట్ కు ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో టెక్నికల్ అసిస్టెంట్ కౌలుట్లయ్య, ఫీల్డ్ అసిస్టెంట్ నరసన్న, పంచాయతీ కార్యదర్శి సురేష్ పాల్గొన్నారు.

అకౌంట్లో డబ్బులు దోచేశారు

ప్రజాశక్తి-కోసిగి

తన అకౌంట్లో డబ్బులు దోచేశాడని బాధితుడు లక్ష్మీనారాయణ తెలిపాడు. మండల పరిధిలోని ఆర్లబండ గ్రామానికి చెందిన లక్ష్మీనారాయణ ఇటివలే ఎస్‌బిఐ క్రెడిట్ కార్డులో డబ్బులు ఉన్నాయి. ఎస్‌బిఐ క్రెడిట్ కార్డులో ఎక్కువగా పెనాల్టీ పడదని తనకు ఒక లింకు పంపించిందని, ఆ లింకు ఓపెన్ చేస్తే తనకు పెనాల్టీలు గానీ , ఎక్స్‌ట్రా ప్రాసెసింగ్ ఫీజులు గాని ఎటువంటివి ఉండవని చెప్పడంతో బాధితుడు తన



ఫోన్లో వచ్చిన లింకును ఓపెన్ చేశాడు. వెంటనే సాయంత్రానికల్లా రూ.18,500 డబ్బులు మాయమైనట్లు బాధితుడు తెలిపాడు. రోజురోజుకు సైబర్ నేరాలు ఎక్కువవుతున్నాయని , అధికారులు స్పందించి ఇలాంటి మోసాలను అరికట్టాలని బాధితుడు తెలిపాడు. విషయం తెలుసుకున్న బాధితుడు వెంటనే పోలీస్ స్టేషన్ కు వచ్చి ఫిర్యాదు చేశాడు.



విద్యార్థులు పోరాటాలకు సిద్ధం కావాలి

ఎస్ఎఫ్ఐ

ప్రజాశక్తి-ఆస్పరి

విద్యార్థుల సమస్య పరిష్కారానికి పోరాటాలకు సిద్ధం కావాలని ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీనివాసులు పిలుపునిచ్చారు. బుధవారం స్థానిక ఎస్సిబాయ్స్ హాస్టల్లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ విద్యారంగంలో నెలకొన్న సమస్యలపై ఎస్ఎఫ్ఐ నిరంతరం పోరాడుతుందన్నారు. విద్యార్థులకు ఏచిన్న సమస్యవచ్చినా ఎస్ఎఫ్ఐ ముందుండి పరిష్కారం అయ్యేంతవరకు పోరాటం చేస్తుందన్నారు. కస్తూర్బాగాంధీ, ఆదర్శ పాఠశాలలో సీట్లు దొరకక తల్లిదండ్రులు సుధీర ప్రాంతాలకు తమతోపాటు వలసలకు తీసుకు వెళుతున్నారు. ఇలా తీసుకు వెళ్లడం వల్ల చాలా మంది విద్యార్థులు చదువుకు దూరం అవుతున్నారు. పుట్టకలమర్రి దగ్గర ఉన్న ఆదర్శ పాఠశాల సీట్లతో పాటు గర్ల్స్‌హాస్టల్ సీట్లు కూడా పెంచాలని డిమాండ్‌చేశారు. లేని పక్షంలో విద్యార్థులతో కలిసి పెద్ద ఎత్తున ఆందోళనకు పూనుకుంటామని హెచ్చరించారు. అనంతరం ఎస్ఎఫ్ఐ మండలం కమిటీని ఎన్నుకున్నారు. మండలం అధ్యక్షులుగా ధనుంజయ్, మండలం కార్యదర్శిగా తరుణ్, మరో 10 మందిని కమిటీ సభ్యులుగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సమావేశంలో డివైఎఫ్ఐ మండల కార్యదర్శి రవి, నాయకులు చరణ్, మంజునాథ్, మహేష్ లు పాల్గొన్నారు.

కౌన్సిలర్లను కించపరిచకండి : లలితమ్మ

ప్రజాశక్తి-ఆదోనిరూరల్‌రూరల్

ఆదోని మున్సిపాల్ కమిషనర్ ఎం.కృష్ణ,చైర్మన్ లోకేశ్వరి మీరు ఇరువురు పట్టణములో ఏదైనా వార్డులో పర్యటించే టప్పుడు ఆ వార్డు కౌన్సిలర్లకు కనీస సమాచారం ఇవ్వకుండా పర్యటించడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నానని వెల్లాల లలితమ్మ తెలిపారు. బుధవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ మీకు అవార్డు ప్రజలు రాతపూర్వక ఫిర్యాదు చేసివుంటే ఆ వార్డులో పర్యటించి వెంటనే



సమస్య పరిష్కారం చేసేట్లు అయినా లేదా అత్యవసర పరిస్థితుల్లో పర్యటించిన మీకు మీరు సర్దిచెకోవచ్చుకానీ స్థానిక కౌన్సిలర్‌కు సమాచారం ఇవ్వకుండా మీరు వార్డులో తిరిగి మీ కౌన్సిలర్ సరిగా పట్టించుకోవడం లేదు లేకపోతే సరిగా పనిచేయడం లేదని విమర్శలు చేయడం తీవ్రంగా ఖండిస్తున్నానని వెల్లాలలలితమ్మ మండిపడ్డారు. మీరు ఇరువురు కూడా ఒక పార్టీ ప్రతినిధులుగా వార్డులలో పర్యటించడం సరైన పద్ధతి కాదని అభ్యంతరం వ్యక్తం చేశారు. మా వార్డులో నేను మీ దృష్టికి లేదా కౌన్సిల్ దష్టికి తీసుకువచ్చిన ఒక్క సమస్యను కూడా పరిష్కారం చేయకుండా మా వార్డులో మీరు పర్యటించడం మంచి పద్ధతి కాదని లలితమ్మ దుయ్యబట్టారు. ముందుముందు ఇలాగే చేస్తే ఖచ్చితంగా నిరసనలు ఎదుర్కోవలసి వస్తుందని హెచ్చరించారు.

ఎఇఒ అక్రమాలపై విచారణ చేపట్టాలి

ప్రయివేటు విద్యా సంస్థలకు కొమ్ముకాస్తున్న ఎంఇఒ -ప్రభుత్వ ఆదేశాలు బేఖాతరు

ప్రజాశక్తి మంత్రాలయం

ఎంఈఓ - 1 మోహినుద్దీన్ అవినీతి అక్రమాల పై విచారణ చేపట్టాలని రాయలసీమ అభ్యుదయ విద్యార్థి ఫెడరేషన్ జిల్లా అధ్యక్షులు కృష్ణ డిమాండ్ చేశారు. బుధవారం ఆదోనిలో సబ్ కలెక్టర్ కార్యాలయంలో సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజకు డిమాండ్‌తో కూడిన వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మంత్రాలయం ఎంఇఒగా ,కోసిగి ఎంఇఒగా పని చేస్తూ ప్రైవేట్ విద్యాసంస్థలకు వత్తాసు పలుకుతూఆర్‌టిఇ 25 శాతం ఉచిత సీట్లు వేద విద్యార్థులకు కేటాయించాలని ప్రభుత్వం చెబుతున్నప్పటికీ ఏ ప్రైవేట్ పాఠశాల అమలు చేయక పోతున్నా పట్టించుకోవడం లేదని ఆరోపించారు. అరకొర సీట్లు కేటాయించిన వాటికి కూడా డబ్బులు వసూలు చేస్తూ పేద తల్లిదండ్రులను వేధిస్తున్న పాఠశాలలపై కన్నెత్తి చూడకుండా ముడుపులు తీసుకొని మమా



అనిపించుకున్నారని విమర్శించారు. మధ్యాహ్న భోజన పథకంలో అవినీతికి పాల్పడుతున్న ఎగ్స్ కాంట్రాక్టర్ గాని అలాగే చిక్కిలా కాంట్రాక్టర్ తో వంట ఏజెన్సీ తో కుమ్మక్కై చూసి చూడనట్లు వ్యవహరిస్తున్నారని తెలిపారు. గతంలో టీచర్ ట్రైనింగ్ సంబంధించిన టేరోల్ డబ్బులు స్వాహా చేసిన ఆయనపై ఎంక్వయిరీ జరిగినా ఇంతవరకు పై అధికారులు చర్యలు తీసుకోకపోవడం ఏంటని ప్రశ్నించారు. సక్రమంగా విధులకు హాజరు కాకుండా రెండో మండలాల పేరు చెప్పి వధాగా ప్రభుత్వ ధనం జీతం గా పొందుతున్నాడన్నారు. కొంతమంది ఉపాధ్యాయులను డిప్యూటేషన్ పేరుతో డబ్బులు తీసుకొని తమ కార్యాలయంలోనే ఉంచుకున్నారని ఇకనైనా పై అధికారులు స్పందించి అవినీతి ఎంఇఒ 1 విచారించే తక్షణమే సస్పెండ్ చేయాలని కోరారు.

గుర్తుతెలియని మహిళ మృతదేహం లభ్యం

ప్రజాశక్తి మంత్రాలయం

మంత్రాలయం వద్ద ప్రవహిస్తున్న తుంగభద్ర నదిలో గుర్తు తెలియని మహిళ మృతదేహం కనిపించిందని ఎస్ఐ శివాంజల్ తెలిపారు. బుధవారం ఉదయం శ్రీ రాఘవేంద్రస్వామి మఠం సమీపంలో తుంగభద్ర నది వడ్డుకు భహిర్భూమికి వెళ్లిన భక్తులు నదిలో ఒక గుర్తు తెలియని ఆడ శవం కనిపించిందని సమాచారం రావడంతో అక్కడకు వెళ్లి చూడగా సుమారు 55 సం.లు వయసు గల మహిళ గ్రీన్ కలర్ చీర తో పై నలుపు ఆకుపచ్చ డిజైన్ గల చీర, అదే చీర డిజైన్‌గల జాకెట్, ఎడమ ముక్కుకు సన్నని ముక్కు రాయి ఉన్నాయన్నారు. ఒక జత బ్లూ కలర్ చెప్పులుగా ఉండి చనిపోయి తేలియాడుతూ ఉండడం గమనించినట్లు పేర్కొన్నారు. విఆర్ఒ భీమయ్య ఫిర్యాదు మేరకు కేసుగా నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. మృతి చెందిన మహిళ గురించి ఆచూకీ తెలిసిన వారు 9121101152 అను నెంబరుకు సమాచారం ఇవ్వాలని కోరారు.



రైతు సంక్షేమమే టీడీపీ ప్రభుత్వ ధ్యేయం

ప్రజాశక్తి- దేవనకొండ

రైతు సంక్షేమమే టిడిపి ప్రభుత్వ ధ్యేయమని రాష్ట్ర వాల్మీకి కార్పొరేషన్ చైర్మన్ కప్పట్రాళ్ల బొజ్జమ్మ, మాజీ ఎంపిపి రామచంద్ర నాయుడు టిడిపి మండల కన్వీనర్ విజయభాస్కర్ గౌడ్ పేర్కొన్నారు. తెలుగుదేశంపార్టీ కేంద్ర కార్యాలయం ఆదేశాల మేరకు బుధవారం మండల కన్వీనర్ విజయభాస్కర్ గౌడ్ ఆధ్వర్యంలో గుండ్లకొండ హంద్రీనీవా పంపుహౌస్ దగ్గర జలహారతి ఇచ్చారు. ఈ కార్యక్రమం లో టిడిపి నాయకులు ఉచిరప్ప, రామారావునాయుడు, రామదాస్‌గౌడ్, మల్లికార్జున గౌడ్, రాజశేఖర్ గౌడ్, మల్లేపల్లి రంగుడు, టిడిపి కార్యకర్తలు , రైతులు పాల్గొన్నారు.

ఐ కేంద్రాన్ని పునరుద్ధరించాలి

డివైఎఫ్ఐ మండల అధ్యక్షుడు దుగ్గన్న

ప్రజాశక్తి-పత్తికొండ


పత్తికొండ రెవెన్యూ కేంద్రంలో ఉన్నటువంటి ప్రభుత్వ ఆసుపత్రిలో గతంలో ముఖ్యమంత్రి ఐ కేంద్రం ద్వారా పేదలకు కంటి చికిత్సలు జరిగేవని, ప్రభుత్వం ఏర్పడినప్పటి నుండి ముఖ్యమంత్రి ఐ కేంద్రం నడవడం లేదని వెంటనే ఏర్పాటు చేయాలని డివైఎఫ్ఐ మండల అధ్యక్షులు దుగ్గెన్న డిమాండ్ చేశారు. పశ్చిమ ప్రాంతంలో వెనకబడిన పత్తికొండ నియోజకవర్గం లో ప్రభుత్వ హాస్పిటల్‌లో ఐ కేంద్రం లేదందున దాదాపు సంవత్సరం నుండి వేలాదిమంది పేదవారు కంటి చికిత్స లేక చికిత్స తర్వాత ఇస్తున్నటువంటి ఉచిత కంటి అద్దాలు అందడం లేదని వెంటనే ప్రభుత్వ అధికారులు స్పందించి ఐ కేంద్రం ఏర్పాటు చేసి పేదలకు అందుబాటులో ఉంచాలని డిమాండ్ చేశారు. అనంతరం ప్రభుత్వ హాస్పిటల్ అధికారి డాక్టర్ కల్పన, ఆర్‌డిఒ డాక్టర్ భరత నాయక్ కు వినతి పత్రం అందించారు. కార్యక్రమంలో డివైఎఫ్ఐ నాయకులు అల్లిపిర, జయచంద్రారెడ్డి, రమేష్ ఎన్.సన్నీ, కె.పవన్, రాజశేఖర్, కె.నితిన్,తదితరులు పాల్గొన్నారు.



శ్రీ మఠం నుండి ఆరాధనకు ప్రముఖులకు ఆహ్వానం

ప్రజాశక్తి మంత్రాలయం

ప్రముఖ ఆధ్యాత్మిక పుణ్యక్షేత్రమెన మంత్రాలయంలో రాఘవేంద్రస్వామి ఆరాధన మహోత్స వాలకు శ్రీ మఠం అసిస్టెంట్ మేనేజర్ ఐపి నరసింహ మూర్తి ఆహ్వాన పత్రికలను అందజేసి ఆహ్వానించారు. బుధవారం కర్ణాటక రాష్ట్రంలోని



బెంగళూరు లో కర్ణాటక రాష్ట్ర ముఖ్యమంత్రి సిద్ధరామయ్యకు, చిన్న నీటి పారుదల శాఖ మంత్రి బోసరాజు, బిజెపి రాష్ట్ర అధ్యక్షులు విజయింద్రను మర్యాద పూర్వకంగా కలిసి ఆగస్టు 08 నుండి 14 వరకు పీఠాధిపతులు శ్రీ సుభుదేంద్రతీర్థుల ఆధ్వర్యంలో మంత్రాలయంలో జరుగనున్న రాఘవేంద్రుని సప్త రాత్రోత్సవాలకు ముఖ్య అతిథులుగా రావాలని కోరారు.



ఉపాధి రంగాన్ని బలోపేతం చేయడమే లక్ష్యం

ప్రజాశక్తి ఆదోని

పెట్టుబడులు ఆకర్షిస్తూ ఉపాధి రంగాన్ని బలోపేతం చేసి యువతకు ఉద్యోగాలు కల్పించడమే సిఎం చంద్రబాబు లక్ష్యమని టిడిపి సీనియర్ నాయకుడు ఉమాపతి నాయుడు తెలిపారు. బుధవారం పట్టణంలోని మరాఠా వీధిలో వార్డు ఇన్‌ఛార్జి సతీష్ ఆధ్వర్యంలో సూపరిపాలనకు తొలి అడుగు కార్యక్రమం కింద ఇల్లిల్లూ తిరుగుతూ ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాల కరపత్రాలను పంపిణీ చేశారు. కురుబ కార్పొరేషన్ చైర్మన్ దేవేంద్రప్ప , టిడిపి రాష్ట్ర బీసీ సెల్ ఉపాధ్యక్షులు గుడిసె శ్రీరాములు, రాష్ట్ర కార్యదర్సులు ఉమ్మిసలీం, శ్రీకాంత్ రెడ్డి, నాయకులు రామస్వామి, రంగస్వామి నాయుడు, మురళి, మాజీ కౌన్సిలర్ తిమ్మప్ప, హనుమంతు, సాదిక్ వల్లి లక్ష్మీనారాయణ,వార్డు నాయకులు వున్నారు